J/NELLORE/003/21-23 R.N.I.No.25359/74 పేజీలు : 12




THE BEST TELUGU WEEKLY OF NELLOREANS

# లాయర్

సంపుటి : 43 సంచిక : 18 6.10.2023, శుక్రవారం వెల : రూ. 5 /- వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంపాదకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి

• ఆపరేషన్ ఎలక్షన్ - లోపాల కరెక్షన్

## పాలనలో దిద్దుబాటు



## పార్టీలో సర్దుబాటు

- రాష్ట్రంలో రోడ్లన్నీ వేసేస్తామంటున్నారు
- పెండింగ్ బిల్లులన్నీ చెల్లించేస్తామంటున్నారు
- వేలమందికి ఉద్యోగాలు వచ్చేస్తాయంటున్నారు
- అలిగి అటకెక్కిన వారిని బుజ్జగిస్తున్నారు
- వెళ్లిపోయిన వారిని తిరిగి రమ్మంటున్నారు
- ఇక అందరినీ జగన్ కలుస్తాడంటున్నారు

*ఆంధ్రలో యువజన శ్రామిక రైతు(వైఎస్సార్) కాంగ్రెస్‌పార్టీ 151 సీట్లతో ఘన విజయం సాధించి, రాష్ట్ర ముఖ్యమంత్రిగా రాజశేఖరరెడ్డి రాజకీయ వారసుడు వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి అధికార పగ్గాలు చేపట్టి మరో ఏడు నెలలకి ఐదేళ్లు పూర్తవుతుంది. ఎప్పుడైనా ఎక్కడైనా కొత్తగా ఒక ప్రాంతీయపార్టీ పుడితే ఆ పార్టీలో దాదాపుగా అందరూ కొత్తవారే ఉంటారు. ఆ పార్టీ అధికారంలోకి వస్తే... ఏ కొద్దిమందో తప్ప ఎక్కువశాతం నయా నాయకులే ఎంపీలుగా, ఎంఎల్‌ఏలుగా గెలిచి చట్టసభలలో అడుగు పెడతారు. వాళ్లలో అదృష్టం ఉన్నవాళ్ళు మంత్రులు కూడా అవుతారు.*

*సాధారణంగా ఒక కొత్త పార్టీ ఏర్పడి, ముఖ్యమంత్రితో సహా అంతా కొత్త వారైనప్పుడు పాలనలో లోపాలు మామూలే. పార్టీలో అలకలు, పాలనలో తప్పుల తడకలూ సర్వసాధారణమే. అంతా కొత్త, అందరూ కొత్తవాళ్ళే కాబట్టి, అటు పార్టీలోనూ ఇటు పాలనలోనూ ఇలాంటి పరిస్థితి సహజంగా ఒక ఏడాదో లేక రెండేళ్ళో ఉంటుంది.*

కానీ, వైసీపీ అధికారంలోకి వచ్చి నాలుగున్నర సంవత్సరాలు గడిచినా ఇంకా తప్పటడుగులు వేస్తూనే ఉందన్న విమర్శలు వినపడుతూనే ఉన్నాయి. పాలనను గాడినపెట్టి, రాష్ట్రాన్ని అభివృద్ధిపథంలో పరుగులు పెట్టించడంలో జగన్‌మోహన్‌రెడ్డి సఫలం కాలేదన్న అభిప్రాయం మేధావుల నుండి వ్యక్తమవుతోంది.

పార్టీని పటిష్టపరచడంలోను, పార్టీ కోసం కష్టపడిన ద్వితీయశ్రేణి నాయకులను గుర్తించడంలోనూ, పార్టీయే ప్రాణంగా పనిచేసిన కార్యకర్తలను చేరదీయడంలోనూ, తన కోసం పాటుపడిన రాజకీయేతర ముఖ్యులను దగ్గర చేసుకోవడంలోనూ జగన్‌మోహన్‌రెడ్డికి ఫెయిల్ మార్కులే పడతాయంటున్నారు విశ్లేషకులు. జగన్ కోసం రహస్యంగా పనిచేస్తున్న కొన్ని సర్వే బృందాలు కూడా ఇదే విషయాన్ని జగన్ కోటరీకి

10లో

## చల్లగ చూసే అమ్మ... వెంకటగిరి పోలేరమ్మ



### పోలేరమ్మ జాతరకి పోటెత్తిన భక్తజనం


### అమ్మవారి నామోచ్ఛారణలతో మార్మోగిన పురవీధులు

### రామ్‌కుమార్‌రెడ్డి నేతృత్వంలో భారీ ఏర్పాట్లు

**వెంకటగిరి పోలేరమ్మ జాతరని ఆంధ్ర ముఖ్యమంత్రి జగన్ రాష్ట్ర పండుగగా ప్రకటించిన తరువాత తొలిసారిగా అక్టోబర్ 4, 5తేదీలలో జరిగిన జాతరను ఇప్పటివరకూ కనీవినీ ఎరుగని రీతిలో నిర్వహించి పోలేరమ్మ భక్తుల మనసులు దోచుకున్నారు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి. అనాదిగా వస్తున్న వీఐపీ పాసుల సంస్కృతికి ఆయన మంగళం పాడారు. సిఫారసులని త్రోసిపుచ్చారు. దైవం ముందు అందరూ సమానమే అనేలా క్యూ లైన్‌లను ఏర్పాటు చేసి, అందరినీ ఆ లైన్ల ద్వారానే అమ్మవారి దర్శనానికి పంపించారు. "కొన్ని దశాబ్దాలుగా మేము జాతరకి వస్తున్నాం, ఎలాంటి తొక్కిడి లేకుండా, హడావుడి లేకుండా ఇంత ప్రశాంతంగా తల్లిని దర్శనం చేసుకోవడం ఇదే తొలిసారి అంటూ పెద్దవయసు కలిగిన వెంకటగిరి వాసులు రామ్‌కుమార్‌పై ప్రశంసల వర్షం కురిపిస్తున్నారు.**

కేవలం ప్రోటోకాల్ ఉన్నవారికి మాత్రమే ప్రత్యేక దర్శనం అంటూ నిబంధన పెట్టి సామాన్య భక్త జనాల పొగడ్తలను సొంతం చేసుకున్నారు రామ్‌కుమార్‌రెడ్డి. ఈసారి ఏర్పాట్లలో కూడా ఎక్కడా రాజీపడకుండా తనదైన అభిరుచిని కనపరుస్తూ... పుష్పాలంకరణ, సాంస్కృతిక కార్యక్రమాలు, క్యూ లైన్ల ఏర్పాట్లు వంటి అన్ని విషయాలలో ప్రత్యేకశ్రద్ధ కనపరచారు. రామ్‌కుమార్‌రెడ్డి సమీప బంధువు కృష్ణచైతన్య స్వీయ పర్యవేక్షణలో భక్తులు పులకరించే స్థాయిలో ఈసారి జాతర జరిగిందని వెంకటగిరి వాసులు సంబరపడిపోతున్నారు.

3లో



# కురుగొండను పర్యాటకంగా తీర్చిదిద్దాలి

## బీజేపీ నేత మిడతల విజ్ఞప్తి



నెల్లూరు జిల్లాలోని కలిగిరి రిజర్వాయర్ మధ్యలో ఉన్న కురుగొండ ప్రాంతాన్ని పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయాలని బీజేపీ నాయకుడు, నమామి గంగే రాష్ట్ర కన్వీనర్ మిడతల రమేష్ విజ్ఞప్తి చేశారు. ఇటీవల బుచ్చిరెడ్డిపాళెంలో ఆయన బీజేపీ నాయకులతో కలసి, కొండాలమ్మ ఆలయం వద్ద రిజర్వాయర్ మధ్యలో ఉన్న కురుగొండ దిబ్బను పరిశీలించారు. ఆ ప్రాంతాన్ని పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయాలని కేంద్ర పర్యాటక శాఖ మంత్రి కిషన్‌రెడ్డి దృష్టికి కూడా తీసుకువెళ్లామని రమేష్ ఈ సందర్భంగా తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ స్థానిక నాయకులు రామిశెట్టి మోహన్, కాసా శ్రీనివాసులు, నాగార్జున తదితరులు పాల్గొన్నారు.

# వృద్ధులను కష్టపెట్టొద్దు!



వృద్ధులను నిర్లక్ష్యం చేయకుండా వారిని అభిమానంతో ఆదరించడం అందరి బాధ్యత అని నెల్లూరులోని నారాయణ దంత వైద్య కళాశాల హెచ్‌ఓడి డా.ఎన్.కన్నన్ చెప్పారు. ప్రపంచ వృద్ధుల దినోత్సవ సందర్భంగా ఇటీవల నగరంలోని నిరాశ్రయుల ఆశ్రమ కేంద్రంలోని వృద్ధాశ్రమంలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, వృద్ధులు జాతీయ సంపద అని, వారిని ఆదరించడం, కాపాడుకోవడం ప్రభుత్వంతో పాటు కుటుంబసభ్యుల బాధ్యతని అన్నారు. వసుజ్యోతి చారిటబుల్ ట్రస్ట్ ఛైర్‌పర్సన్ జె.వసుంధర, సీనియర్ సిటిజన్ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు డాక్టర్ కొండూరు హరినారాయణరెడ్డి తదితరులు పాల్గొని వృద్ధులకు అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏ.జయ ప్రకాష్, టి.రామ్మోహన్, శాఖవరపు వేణుగోపాల్, షేక్ రసూల్, జి.శేషయ్య, డి.శ్రీనివాసులు, మురళీమనోహర్‌రాజు, ఈగ వెంకటేశ్వర్లు, నూర్‌జాన్ బేగం, మాజీ కార్పొరేటర్ సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు. అనంతరం ప్రముఖ నృత్యకళాకారిణి.. క్రీడాకారిణి వసుంధరాదేవిని, డాక్టర్ కన్నన్‌ను నిర్వాహకులు ఘనంగా సత్కరించారు.

# హిందూ ధర్మ పరిరక్షణే ధ్యేయం

## పూజ్యశ్రీ దయానంద సరస్వతి స్వామి

హిందూ ధర్మపరిరక్షణే ధ్యేయంగా శౌర్యజాగరణ యాత్ర చేపట్టామని, హిందూజాతి పూర్వవైభవం కోసం ప్రతిఒక్కరూ కృషిచేయాలని పూజ్యశ్రీ దయానంద సరస్వతి స్వామి పిలుపునిచ్చారు. ఇటీవల ఆయన కావలిలో ముసునూరు హనుమత్‌క్షేత్రం వద్ద ఆలయ అర్చకులు వేదగిరి సూర్యనారాయణాచార్యులు అధ్యక్షత్వంలో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, యువత చైతన్యవంతులు కావాలని, ధర్మపరిరక్షణకు నడుంబిగించాలన్నారు. అనంతరం కావలి పట్టణంలో జరిగిన శౌర్యయాత్రలో భజరంగదళ్ ప్రతినిధులు సురేంద్ర, కోటేశ్వరరావు, తేజ, సుబ్బరాయుడు, బీజేపి నాయకుడు బ్రహ్మానందం తదితరులు పాల్గొన్నారు.

# గంజాయి ముఠా అరెస్ట్

## ○ రూ.2 లక్షల సరుకు స్వాధీనం



నెల్లూరులో గుట్టుచప్పుడు కాకుండా గంజాయిని అమ్ముతూ అక్రమార్జనలకు పాల్పడుతున్న ముగ్గురిని స్థానిక నవాబుపేట పోలీసులు ఈనెల 1న అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి 9 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. నగర డీఎస్పీ డి.శ్రీనివాసరెడ్డి నిందితుల వివరాలను వెల్లడిస్తూ, అనంతపురం జిల్లాకు చెందిన డ్రైవర్ షావలి ఒడిశా నుంచి గంజాయిని తీసుకొచ్చి అమ్మేవాడని, కడపజిల్లాలో తన సోదరి సబీరాను, నెల్లూరు మూలాపేటలోని షేక్ షైరజ్‌ను, మరోవ్యక్తిని తనతో కలుపుకుని గంజాయి విక్రయాలు చేస్తున్నాడని, ఆ సమాచారం తెలిసి నవాబుపేట పోలీసులు పట్టుకున్నట్లు తెలిపారు. గంజాయి ముఠాని పట్టుకున్న ఇన్స్‌పెక్టర్ ఎం.బాబి, ఎస్‌ఐలు బి.శివప్రకాష్, ఎస్‌పి రెహమాన్, సిబ్బంది జి.వెంకటేశ్వర్లు, ఆర్‌వి రత్నం, సురేంద్రబాబు, మోహన్‌బాబు, వేణు, మస్తానయ్య, శ్రీనిజను డీఎస్పీ అభినందించారు.



## జిల్లా సమగ్రాభివృద్ధి కోసం

# సిపిఎం పాదయాత్రలు

జిల్లా సమగ్రాభివృద్ధి కోసం సిపిఎం జిల్లాశాఖ ఆధ్వర్యంలో పాదయాత్రలు నిర్వహించనున్నామని ఆ పార్టీ నాయకురాలు దుగ్గిరాల అన్నపూర్ణమ్మ, మండల నాయకులు దేవదానం, బీసీ భాస్కర్, ఆదిశేషయ్య, సతీష్ తెలిపారు. ఈనెల 1న మండల కేంద్రమైన మనుబోలులో వారు సిపిఎం పాదయాత్రకు సంబంధించిన గోడపత్రికలను ఆవిష్కరించారు. ప్రజలు, రైతుల పక్షాన సిపిఎం పోరాడుతుందని వారు పేర్కొంటూ, జిల్లాలో ప్రజలు, రైతులు, అన్ని రంగాల వారు ఎన్నోరకాల సమస్యలతో సతమవుతున్నారని, అయినా ప్రభుత్వం ప్రజల సమస్యలను పట్టించుకోకపోవడం దారుణమని విమర్శించారు. ప్రజాసమస్యల పరిష్కారానికి ఈనెల 13న నెల్లూరులో సిపిఎం ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున సభ జరుగనుందని, కార్యకర్తలు, నాయకులు పెద్దసంఖ్యలో తరలివచ్చి జయప్రదం చేయాలని వారు విజ్ఞప్తిచేశారు.

## జిల్లాలో 7,8 తేదీల్లో

# నాగబాబు పర్యటన

జనసేన ప్రధాన కార్యదర్శి కొణిదెల నాగబాబు ఈనెల 7,8 తేదీల్లో ఉమ్మడి నెల్లూరు జిల్లా పర్యటనకు వస్తున్నట్లు ఆ పార్టీవర్గాలు తెలిపాయి. 7న సర్వేపల్లి, కోవూరు, గూడూరు, వెంకటగిరి, సూళ్ళూరుపేట, కావలి నియోజకవర్గాల నాయకులతోను, 8న నెల్లూరు నగరం, నెల్లూరు రూరల్, ఆత్మకూరు, ఉదయగిరి నియోజకవర్గాల నాయకులతోనూ ఆయన సమావేశమై పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేస్తారని పేర్కొన్నారు.

# రాపూరులో స్వచ్ఛత ర్యాలీ

మండలకేంద్రమైన రాపూరులో పంచాయతి కార్యదర్శి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఈనెల 1న స్వచ్ఛతాహి సేవ ర్యాలీ నిర్వహించారు. సచివాలయ సిబ్బందితో కలసి వీధివీధినా తిరుగుతూ ప్రజలు పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని చెప్పారు. అపరిశుభ్రంగా ఉన్న వీధులను చీపుర్లుతో శుభ్రం చేశారు.

## విశ్రాంత ఉద్యోగుల సంఘం

# ప్రధాన కార్యదర్శిగా లక్ష్మీనారాయణ

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల ఉద్యోగుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా నెల్లూరు నగరానికి చెందిన ఐ.లక్ష్మీనారాయణ ఎన్నికయ్యారు. విజయవాడలో ఈనెల 3న జరిగిన ఆ సంఘం ఎన్నికల్లో ఆయన్ను ఎన్నుకున్నారు. ప్రభుత్వ పెన్షనర్లకు రావాల్సిన డీఆర్ బకాయిలను, పీఆర్‌సి బకాయిలను చెల్లించి, విశ్రాంత ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని ఆయన ఈ సందర్భంగా ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

# డా.స్వామినాథన్ సేవలు ఆదర్శనీయం

## సంతాపసభలో ఎన్‌బికెఆర్ డైరెక్టర్ డా. విజయకుమార్‌రెడ్డి



ఇటీవల దివంగతులైన హరిత విప్లవ పితామహుడు డా.ఎంఎస్ స్వామినాథన్ సంతాపసభ కోట మండలం విద్యానగర్‌లోని ఎన్‌బికెఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో ఘనంగా జరిగింది. కళాశాల మెకానికల్ ఇంజనీరింగ్ స్టూడెంట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ సభకు కళాశాల డైరెక్టర్ డాక్టర్ వి విజయ్‌కుమార్‌రెడ్డి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, డాక్టర్ స్వామినాథన్ రైతాంగానికి చేసిన సేవలు అపూర్వమని కొనియాడారు. ఆయన మృతి దేశానికి తీరని లోటన్నారు. నేటి యువత ఆ మహనీయుని ఆదర్శంగా తీసుకొని ముందుకు సాగాలన్నారు. మెకానికల్ విభాగాధిపతి డాక్టర్ సిహెచ్‌ఆర్ విక్రమ్‌కుమార్, పలువురు అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు. తొలుత డా.స్వామినాథన్ మృతికి సంతాపం తెలియజేస్తూ కొవ్వొత్తులతో నివాళులు అర్పించారు.

# అసమానతలను రూపుమాపేందుకే.. 'సామాజిక సమరసత'



సమాజంలోని అసమానతలను రూపుమాపేందుకు, దురాచారాలను నిరోధించేందుకు సామాజిక సమరసత సంస్థ ఏర్పడిందని ఆ సంస్థ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కోడూరు సత్యం అన్నారు. ఇటీవల నెల్లూరులోని ఆర్‌ఎస్‌ఎస్ కార్యాలయంలో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ, సమాజాభ్యున్నతికి కృషిచేసిన మహనీయులను స్మరించుకుంటూ అక్టోబర్ 8వ తేది ఉదయం 10 గంటలకు గొలగమూడిలోని అవధూత భగవాన్ శ్రీ వెంకయ్య స్వామి ఆశ్రమంలో సమరసత సమ్మేళనం నిర్వహించనున్నామని తెలిపారు. సమాజంలోని అసమానతలను రూపుమాపేందుకు కృషిచేసిన మహనీయులు శ్రీ వెంకయ్యస్వామి, శ్రీ మలయాళస్వామి వంటి అవధూతలతో పాటు, స్వాతంత్ర్యసమరయోధులు పొణకా కనకమ్మ, వెన్నెలకంటి రాఘవయ్య, సమాజ సంస్కర్తలు శ్రీ పొట్టి శ్రీరాములు, బాలకృష్ణారెడ్డి, ఏనుగు పట్టాభిరామిరెడ్డి తదితరుల స్ఫూర్తితో ఈ సమ్మేళనం నిర్వహించనున్నట్లు చెప్పారు. పాతనెల్లూరు, ప్రకాశం, చిత్తూరు జిల్లాలోని వారందరూ పాల్గొని ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు. ఆమేరకు ఆయన సమ్మేళనం గోడపత్రికలను ఆవిష్కరించారు. ప్రముఖ న్యాయవాది డి.రాజేంద్ర, జయప్రద, ప్రాంత మహిళా ప్రముఖ్ ముప్పిరాళ్ల సుబ్రహ్మణ్యం, జయప్రకాష్, మోవిడి శ్రీనివాసులు, బూదూరు కేశవరామ్, డాక్టర్ సతీష్, పూడి రవి, వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి కేశవులు తదితరులు పాల్గొన్నారు.

## 'అపర అన్నమయ్య' బిరుదుతో..

# గుండాల గురవయ్యకు సత్కారం



ఎంతోమంది చిన్నారులకు, పెద్దలకు అన్నమయ్య సంకీర్తనలు గానం చేయడంలోనూ, కోలాటం ప్రదర్శనలివ్వడంలోనూ ఉచితంగా శిక్షణ ఇస్తూ, ప్రజల్లో ఆధ్మాతిక భక్తిభావనలను పెంపొందిస్తున్న నెల్లూరుకు చెందిన ప్రముఖ భక్తిగాన గాయకుడు గుండాల గురవయ్యకు 'అపర అన్నమయ్య' బిరుదుతో ఘన సత్కారం జరిగింది. ఆయన శిష్యబృందం పెద్దసంఖ్యలో తరలివచ్చి తమ గురువైన గురవయ్యను అభిమానంతో సన్మానించుకున్నారు. ఈనెల 1న స్థానిక టౌన్‌హాలులో జరిగిన ఈ కార్యక్రమంలో సాయిదర్బార్ అద్దాల మందిరం గౌరవసలహాదారు, ప్రముఖ దాత పాబోలు రామసుబ్బారావు, మోడరన్ స్కూల్ అధినేత, టీటీడీ ధర్మప్రచార పరిషత్ సభ్యులు వాకాటి విజయ కుమార్‌రెడ్డి, శ్రీకృష్ణ యోగమందిరం ట్రస్టీ డాక్టర్ సర్వేపల్లి అజయ్‌కుమార్ తదితరులు పాల్గొని గత 40 ఏళ్ళుగా జిల్లాలో ఎన్నో భజనబృందాలను ఏర్పాటుచేసి వారికి భజనపాటలు, కోలాటాలు నేర్పుతున్న గురవయ్య ఆధ్యాత్మిక సేవలు అపూర్వమని కొనియాడారు. దేశవ్యాప్తంగా ఎన్నో పుణ్యక్షేత్రాల్లో గురవయ్య భక్తిగానాలు భక్తాదులను ఆకట్టుకున్నాయని ప్రశంసించారు. నటుడు దోర్నాల హరిబాబు, వీరిశెట్టి సుధాకర్ తదితరులు పర్యవేక్షించారు.

# పోలేరమ్మ జాతరకి పోటెత్తిన భక్తజనం





**వెంకటగిరి గ్రామదేవత, భక్తుల కొంగుబంగారంగా నిలిచిన మహాశక్తిదేవత.. కష్టాలు తీర్చి..కోర్కెలు నెరవేర్చే కరుణామయి..శ్రీ పోలేరమ్మ అమ్మవారి జాతరకు జిల్లా నుంచే కాక, రాష్ట్రవ్యాప్తంగా భక్తజనం పోటెత్తారు. దీంతో వెంకటగిరి పట్టణమంతా భక్తజనసంద్రంగా మారింది. ఈనెల 4,5 తేదీల్లో అమ్మవారి జాతర వైభవోపేతంగా జరిగింది. వైకాపా నాయకుడు, రాష్ట్ర కమ్యూనిటీ డెవలప్‌మెంట్ బోర్డు ఛైర్మెన్ నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి సారథ్యంలో కనీవినీ ఎరుగని రీతిలో జాతర ఏర్పాట్లు జరిగాయి. ఆలయ నిర్వాహకులు, వెంకటగిరి రాజా కుటుంబీకులు, జిల్లాలోని ప్రముఖ నాయకులు, ఉన్నతాధికారులు, పెద్దసంఖ్యలో స్థానిక ప్రజలు, దేశవిదేశాల్లో ఉన్న వెంకటగిరీయులెందరో తరలివచ్చి ఉత్సాహంగా అమ్మవారి జాతరలో పాల్గొన్నారు.**

జిల్లాలోనే కాక, రాష్ట్రవ్యాప్తంగా ప్రసిద్ధమైన వెంకటగిరి పోలేరమ్మ అమ్మవారి జాతర బుధవారం (ఈనెల 4వ తేది) రాత్రి అంగరంగవైభవంగా ప్రారంభమైంది. 5వ తేది నగరోత్సవం భక్తజనంతో ఆనందకోలాహలంగా జరిగింది. ఎక్కడ చూసినా భక్తజనంతో పట్టణమంతా క్రిక్కిరిసిపోయింది. ఈ సందర్భంగా అమ్మవారి ఆలయాన్ని విద్యుత్‌శోభలతో దేదీప్యమానం చేశారు. ప్రత్యేక అలంకారాలతో అమ్మవారికి ప్రత్యేకపూజలు చేశారు. 'అమ్మా! మహాశక్తీ..పోలేరమ్మా! కరుణించమ్మా '.. అంటూ భక్తులు పెద్దపెట్టున అమ్మవారిని ప్రార్థించుకుంటూ జాతరలో పాల్గొన్నారు.

వెంకటగిరిలో ఎంతోకాలం నుంచి ప్రతిఏటా సంప్రదాయబద్ధంగా జరుగుతున్న అమ్మవారి జాతరను రాష్ట్ర పండుగగా గుర్తించాలని వైకాపా నాయకుడు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి ఇటీవల ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని కోరడం, ఆమేరకు సీఎం సానుకూలంగా స్పందించి వెంకటగిరి జాతరను రాష్ట్ర పండుగగా గుర్తించి జీఓ కూడా ఇచ్చిన నేపథ్యంలో, రాష్ట్రపండుగ అయినతర్వాత తొలిసారిగా జరుగుతున్న ఈ జాతరను అంబరాన్నంటే సంబరంగా నిర్వహించారు.

అమ్మవారి పుట్టినిల్లయిన కుమ్మరివీధిలోని ఇంట్లో అమ్మవారి ప్రతిమను అత్యద్భుతంగా రూపుదిద్ది సంప్రదాయం ప్రకారం ప్రత్యేకపూజలు చేశారు. అర్ధరాత్రి తర్వాత మెట్టినింటికి తీసుకువచ్చి ఆలయం వద్ద చప్పరంపై వేంచేపు చేశారు. వెంకటగిరి రాజా కుటుంబీకులు సాయికృష్ణ యాచేంద్ర తదితరుల ఆధ్వర్యంలో సమర్పించిన పట్టుచీరను అమ్మవారికి అలంకరించి పెద్దఎత్తున నగరోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తజనం పోటీలుపడ్డారు. అమ్మవారి ఆలయం వద్ద భక్తజనం ఒక ప్రవాహంలాగా కనిపించారు. ఉదయం నుంచి రాత్రి దాకా భక్తులు అమ్మవారి దర్శనానికి క్యూ కట్టారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు జరగకుండా, తోపులాటలకు తావులేకుండా నిర్వాహకులు క్యూలైన్లతో పాటు గట్టి పోలీసుబందోబస్తు ఏర్పాటు చేశారు. రామ్‌కుమార్‌రెడ్డి చొరవతో, ఈసారి గతంలో ఎప్పుడూ లేనివిధంగా వీఐపి దర్శనాలు రద్దుచేసి, భక్తజనులందరికీ అమ్మవారిని దర్శించుకునే భాగ్యాన్ని కల్పించడంతో భక్తలోకంలో సంతోషం వ్యక్తమైంది. ఈనెల 5న అమ్మవారి జాతరలో కీలకఘట్టమైన నగరోత్సవంలో వేలసంఖ్యలో భక్తులు పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. జాతరలో భాగంగా అమ్మవారి నిలుపు, నిష్క్రమణ కార్యక్రమాలు మంగళవాద్యాలు, తప్పెట్ల మోతలు, భారీ బాణసంచా వేడుకల మధ్య వెంకటగిరి జాతర కనువిందుగా జరిగింది.

## కసుమూరులో..
# 11 నుంచి గంధమహోత్సవాలు



జిల్లాలో ఎంతో ప్రసిద్ధమైన వెంకటాచలం మండలం, కసుమూరు గ్రామంలో వెలసివున్న శ్రీ హజరత్ సయ్యద్ కరీముల్లాషా ఖాదరి(వురఫ్) కాలేషాపీర్ మస్తాన్ వలి రహమతుల్లా అలైహి దర్గా (కసుమూరు మస్తానయ్య దర్గా)లో ఈ నెల 11 నుండి 13వతేదీ వరకు 246వ గంధ ఉరుసు మహోత్సవాలు వైభవంగా జరుగుతాయని, ఈ ఉత్సవాలకు వేలమంది భక్తులు తరలివస్తారు కనుక, భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేయాలని నెల్లూరు ఆర్డీఓ మలోల అధికారులను ఆదేశించారు. ఈనెల 4న కసుమూరులో ఆయన సంబంధిత శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, భక్తులకు అవసరమైన త్రాగునీటి సౌకర్యం, మరుగుదొడ్లు తదితర మౌలిక సదుపాయాలను కల్పించాలన్నారు. భక్తుల భద్రతకు గట్టి పోలీసు బందోబస్తు ఏర్పాటుచేయాలని పోలీసు ఉన్నతాధికారులకు, ఇతర ప్రాంతాల నుంచి వచ్చే భక్తుల సౌకర్యార్థం ఆయా రూట్లలో బస్సులు నడిపేందుకు చర్యలు చేపట్టాలని ఆర్టీసీ అధికారులకు సూచించారు. భక్తులకు అత్యవసర సమయంలో చికిత్స అందించేందుకు అవసరమైన మందులతో వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేయాలని సంబంధిత వైద్యులకు తెలిపారు. విద్యుత్ శాఖ వారు విద్యుత్ అంతరాయం లేకుండా చూడాలని, అవసరమైతే ప్రత్యేక ట్రాన్స్‌ఫారం కూడా ఏర్పాటు చేయాలని చెప్పారు. వక్ఫ్‌బోర్డు అధికారులు స్వామివారి ఉరుసు ఉత్సవాలు ఘనంగా జరిగేలా సంబంధిత శాఖల అధికారులతో సమన్వయం చేసుకుని ఉత్సవాలను విజయవంతం చేయాలని కోరారు. దర్గా ముజావర్లు ఆసిఫ్, మున్వర్, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

# చనిపోయిన గేదె కోసం వెళ్లి.. ఇద్దరు చనిపోయారు

- మామిడిపూడి చెరువులో మునిగి దుర్మరణం





చెరువులో గేదె మునిగి చనిపోయిందని తెలుసుకుని, దానిని వెలికి తీసేందుకు చెరువులో దిగిన ఇద్దరు ప్రమాదవశాత్తూ నీళ్ళలో మునిగి చనిపోయారు. ముత్తుకూరు మండలం మామిడిపూడి గ్రామంలో మంగళవారం ఈ దుర్ఘటన జరిగింది. ముత్తుకూరుకు చెందిన సుమంత్‌రెడ్డి గేదె తప్పిపోయింది. అదెక్కడ ఉందో తెలుసుకునేందుకు ఆయన బంధువులైన మామిడిపూడి నివాసి రావూరు బాబిరెడ్డి(55), ముత్తుకూరు బీసీ కాలనీవాసి లింగారెడ్డి మురళీరెడ్డి(45)లు గాలించడం మొదలు పెట్టారు. అది చెరువులో చనిపోయిందని తెలుసుకుని దాని చెవికి తగిలించివున్న ఇన్సురెన్స్ కమ్మను తీసుకువచ్చేందుకు ఇద్దరూ చెరువులోకి దిగి గల్లంతయ్యారు. ముత్తుకూరు పోలీసులకు ఆ సమాచారం తెలియడంతో గాలింపు చర్యలు చేపట్టి రాత్రంగా గాలించి వారిద్దరి మృతదేహాలను వెలికితీశారు. దీంతో మృతుల కుటుంబాల్లో విషాదం అలముకుంది.



# సీఎం జగన్‌ను కలిసిన.. నెల్లూరు నేతలు

రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని రాజ్యసభ సభ్యులు, జిల్లా వైకాపా అధ్యక్షులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, నెల్లూరు ఎంపీ, నెల్లూరు రూరల్ వైకాపా నియోజకవర్గ సమన్వయకర్త ఆదాల ప్రభాకర్‌రెడ్డి ఈనెల 3న తాడేపల్లిలోని ముఖ్యమంత్రి క్యాంప్ కార్యాలయంలో గౌరవపూర్వకంగా కలుసుకున్నారు. వీరితోపాటు నెల్లూరు నగర మేయర్ పొట్లూరి స్రవంతి-జయవర్ధన్ దంపతులు, డెప్యూటి మేయర్ రూప్‌కుమార్ యాదవ్ పాల్గొని ముఖ్యమంత్రికి పుష్పగుచ్ఛం అందజేశారు. మేయర్‌కు మంచి భవిష్యత్తు ఉంటుందని ఈ సందర్భంగా సీఎం జగన్ ఆమెను ఆశీర్వదించారు. జిల్లా అభివృద్ధికి నిధులు మంజూరుచేయాలని ఈ సందర్భంగా జిల్లా నేతలు కోరగా, అందుకు సీఎం సానుకూలంగా స్పందిస్తూ, జిల్లాలో పార్టీ అభివృద్ధికి అందరూ కలసి కృషిచేయాలని సీఎం వారికి సూచించారు.

## చెన్నై తెలుగుచలన చిత్ర మండలి కమిటీ
# ఎగ్జిక్యూటివ్ సభ్యుడిగా తిరుపతిరెడ్డి



సంయుక్త మూవీస్ బ్యానర్ ద్వారా 1980వ దశకంలో సంచలనాత్మక చిత్రాలు నిర్మించి 'ఖైదీ' సినిమా ద్వారా మెగాస్టార్ చిరంజీవికి హీరో ఇమేజ్ తెచ్చిన మన నెల్లూరు నిర్మాత డాక్టర్ ఎం.తిరుపతిరెడ్డి, చెన్నై తెలుగు చలనచిత్ర మండలి కమిటీ కార్యనిర్వాహక సభ్యుడిగా ఎంపికయ్యారు.

ఈ మండలి 1975లో ఏర్పడింది. ఆ తరువాత హైదరాబాదులో ఏర్పడిన తెలుగు చలనచిత్ర మండలికి అనుసంధానంగా ఈ కమిటీ పనిచేస్తోంది. సెప్టెంబర్ 28వ తేదీ జరిగిన మండలి బోర్డు సమావేశంలో తిరుపతిరెడ్డి నియామకాన్ని మండలి ఏకగ్రీవంగా ఆమోదించింది. 2023-24 సంవత్సరానికిగాను తిరుపతిరెడ్డి ఈ పదవిలో కొనసాగుతారు. సీనియర్ నిర్మాతగా తిరుపతిరెడ్డి సలహాలు, సూచనలు కొత్తతరం నిర్మాతలకి ఎంతో ఉపయోగకరంగా ఉంటాయన్న ఆశాభావాన్ని మండలి గౌరవ కార్యదర్శి కాట్రగడ్డ ప్రసాద్ ఈ సందర్భంగా వ్యక్తం చేశారు. తిరుపతిరెడ్డికి 'లాయర్' అభినందనలు.

# గాంధీజీ ఆశయాల బాటలో నడవాలి




బ్రిటీస్ వారిని మనదేశం నుంచి తరిమికొట్టి దేశానికి స్వాతంత్ర్యాన్ని సముపార్జించి పెట్టిన మహాత్మాగాంధీజీ సేవలు అపూర్వమని, ప్రతి ఒక్కరూ ఆ మహనీయుని ఆశయాల బాటలో నడవాలని, దేశభక్తితో అందరూ దేశాభ్యున్నతికి బాటలు వేయాలని స్థానిక విశ్వసాయి జూనియర్ కళాశాల ఛైర్మెన్ డా. ఎన్. సత్యనారాయణ అన్నారు. అక్టోబరు 2న స్థానిక మాగుంట లేఅవుట్‌లోని విశ్వసాయి జూనియర్ కళాశాలలో జరిగిన గాంధీజీ జయంతి వేడుకల్లో ఆయన పాల్గొని విద్యార్థులకు జాతిపిత మహాత్మాగాంధీజీ గొప్పతనాన్ని వివరించారు. సత్యం, శాంతి, అహింస అనే ఆయుధాలతోనే గాంధీజీ దేశానికి స్వాతంత్ర్యాన్ని సాధించిపెట్టారన్నారు. అదేవిధంగా, అదేరోజున లాల్‌బహుదూర్‌శాస్త్రి జయంతిని కూడా కళాశాలలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో కళాశాల డైరెక్టర్ జి. కృష్ణమోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

# పొదలకూరులో రక్తదానం

పొదలకూరులోని సామాజిక ఆరోగ్య కేంద్రంలో ఈనెల 4న రక్తదాన శిబిరం నిర్వహించారు. ఆ కేంద్రంలో రక్తనిధి(బ్లడ్ బ్యాంక్)ని ఇటీవల నెలకొల్పిన నేపథ్యంలో, ఈ శిబిరం ఏర్పాటుచేసి 15 మంది రక్తదానం చేశారు. రక్తదాతలకు డిడిఓ డాక్టర్ ప్రసాద్ సర్టిఫికెట్లను అంద జేసి అభినందించారు. డాక్టర్ పద్మావతి, డాక్టర్ రవికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

లాయర్
అక్టోబర్ 06, 2023

# దేశవ్యాప్తంగా కమ్ముకొస్తున్న కరువు మేఘాలు

దేశవ్యాప్తంగా కరువు మేఘాలు కమ్ముకొస్తున్నా మన ప్రభుత్వాలు ఇంకా నిద్రమత్తులోనే జోగుతున్నాయి. పర్యావరణం పట్ల, ప్రకృతి పట్ల, ప్రధానంగా ప్రకృతి విపత్తుల పట్ల అవగాహనా రాహిత్యం దేశాన్ని క్రమేణా దుర్భిక్షంలోకి నెడుతోంది. దేశంలో కొన్ని రాష్ట్రాల్లో కుంభవృష్టి, మరికొన్ని రాష్ట్రాల్లో అనావృష్టి..మొత్తంగా వాతావరణమే మారిపోతోంది. రుతువులు గతి తప్పుతున్నాయి. వాతావరణ అసమతుల్యత వల్ల ఉష్ణతాపం పెరిగిపోయి, పసిఫిక్ మహాసముద్రంలోని జలాలు వేడెక్కి భూమండలంలోని వాతావరణమే మారిపోయింది. ప్రకృతి-పర్యావరణంలో అనూహ్యంగా మార్పులు ఏర్పడి 'ఎల్నినో' వంటి అసాధారణ పరిస్థితులు ఏర్పడబోతున్నాయని ప్రపంచవ్యాప్తంగా శాస్త్రవేత్తలు, నిపుణులు నెత్తీనోరు బాదుకుంటున్నా పట్టించుకునేవారు లేరు. ఫలితంగా దేశంలో కరువు కాటకాలు విజృంభిస్తున్నాయి. అయినా మన పాలకులు కానీ, ప్రభుత్వాలు కానీ ఎవరి రాజకీయాల్లో వారు తలమునకలై ఉంటున్నారేతప్ప, ముంచుకొస్తున్న ముప్పులను పట్టించుకోకపోవడం విచారకరం.. బాధాకరం.

మనదేశంలోని 718 జిల్లాల్లో 500కు పైగా జిల్లాల్లో కరువు పరిస్థితులు నెలకొనివున్నాయని తాజాగా 'డౌన్ టు ఎర్త్' అనే సంస్థ తన అధ్యయనం ద్వారా వెల్లడించింది. భారత్‌లో వాతావరణ పరిస్థితులు ఎలా ఉన్నాయన్న అంశంపై ఈ సంస్థ ఇటీవల తన నివేదిక సమర్పించింది. భారత భూభాగంలో 70 శాతానికి పైగా కరువు పరిస్థితులు తాండవిస్తున్నాయన్నది దాని సారాంశం. ఇదెంతో ఆందోళనకరమైన విషయం. ముఖ్యంగా ఈశాన్య భారతదేశంలోను, తూర్పు భారత్‌లోని కొన్ని ప్రాంతాల్లోను, జమ్ము-కశ్మీర్‌తో పాటు మహారాష్ట్ర, కర్నాటక, ఆంధ్రప్రదేశ్ కోస్తాతీరంతో సహా దక్షిణ భారతదేశంలోని అనేక ప్రాంతాల్లోనూ ఒకమోస్తరు కరువు నుంచి కొన్ని చోట్ల తీవ్రమైన కరువు పరిస్థితులు ఏర్పడి ఉన్నాయని, సరైన వర్షాలు లేకపోవడం వల్ల ఈ దుస్థితి దాపురించిందని ఆ నివేదిక తేటతెల్లం చేసింది. సాధారణంగా ఆగస్టులో ఎక్కువ రోజులు వర్షాలు పడతాయి. కానీ, ఈసారి వరుణుడు కరుణించకపోవడంతో వాన చినుకులే కరువయ్యాయి. అందులోనూ ఆగస్టు 7 నుంచి 18వ తేదీ దాకా వర్షాలు కురవకపోవడం అన్నది గత వందేళ్ళలో మూడవ అతిపెద్ద విరామంగా కూడా రికార్డు సృష్టించడం ఇదే తొలిసారి అని నిపుణుల అధ్యయనాలు వెల్లడిస్తున్నాయి. ఇలా వానల్లేని ఈ ఆగస్టు సంక్షోభం.. దేశ రైతాంగానికి పెద్ద దుర్భిక్షంగా మారుతుండడం గమనార్హం. దీంతో పంటలు సాగుతో పాటు, ఇతరత్రా విద్యుదుత్పత్తి వంటి పలు కీలకరంగాల్లో దాని ప్రభావం బాగా ఉండడంతో ఆయా రంగాలకే కాక, మొత్తంగా ప్రజలకు కష్టాలు నష్టాలు తప్పడం లేదని నిపుణులు పదేపదే హెచ్చరిస్తున్నారు.

వాతావరణ శాస్త్రపరిజ్ఞానం ప్రపంచవ్యాప్తంగా శరవేగంగా విస్తరిస్తున్నా, నేటికీ మనదేశంలో అనేకజిల్లాల్లో కనీసం వాతావరణ కేంద్రాలు కూడా ఉండడం లేదంటే, మన సాంకేతికత ఏ స్థాయిలో ఉందో తేటతెల్లమవుతోంది. ఇప్పటికే రుతువులు మారిపోయాయి. ఎండలు ముదిరిపోయాయి. చెరువులు దొరువులు ఎండిపోతున్నాయి. రిజర్వాయర్లలో నీళ్ళు అడుగంటిపోతున్నాయి. పాలకులు చెప్పే జలసంరక్షణ మాటలన్నీ నీటిమూటలుగానే మిగిలిపోతున్నాయి. అనేక ప్రాంతాల్లో పంటలకు విరామం ప్రకటించడం తప్ప మరో ప్రత్యామ్నాయం ఉండడం లేదు. తాగునీటికే గతిలేని పరిస్థితుల్లో ఇక సాగు నీటికి తావెక్కడ?.. వాతావరణ మార్పులను చాలా చిన్న విషయంగా చూడడం, వాటిపై సరైన అవగాహన లేకపోవడం వంటి అజ్ఞానమే దేశాన్ని ఇంకా పట్టి పీడిస్తోంది. వానలు వరదలు వచ్చినప్పుడు ఆ నీళ్లన్నీ వృధాగా సముద్రం పాలవుతూనే ఉన్నాయి. ప్రతి నీటిబొట్టును ఒడిసిపట్టుకుంటామని ప్రభుత్వాల మాటలు కోటలు దాటుతుంటే, ఇంకోవైపు వానలు వరదల్లో వచ్చిన అపారమైన జలరాశులన్నీ నేరుగా సముద్రంలో కలసిపోతూనే ఉన్నాయి. అసలే, కోట్లాదిమంది నిరుపేదలు ఇప్పటికీ అన్నమో రామచంద్రా అంటూ ఆకలికి అలమటిస్తుంటే, మరోవైపు మూలిగే నక్కమీద తాటికాయ పడ్డట్టు.. కరువు మేఘాలు కమ్ముకువస్తుండడం ఆందోళన కలిగించే విషయం. ఇకనైనా ప్రభుత్వాలు కలదెలుసుకోవాలి. చేతులు కాలాక ఆకులు పట్టుకుని ప్రయోజనం ఉండదు. వెంటనే శాస్త్రవేత్తలతో, నిపుణులతో చర్చించి తక్షణ ప్రత్యామ్నాయాలు చూడాలి. ప్రకృతి విపత్తులను..కరువుకాటకాలను అధిగమించే ప్రణాళికలు సిద్ధం చేయాలి. మీనమేషాలు లెక్కబెడుతూ ఇలాగే చేతులు ముడుచుకు కూర్చుంటే...సుభిక్ష భారత్ కాస్తా 'దుర్భిక్ష భారత్' అవుతుంది.

# పోలేరమ్మ జాతర ఏర్పాట్లు బ్రహ్మాండం!

ఈ ఏడాది వెంకటగిరి శ్రీశ్రీశ్రీ పోలేరమ్మ తల్లి వారి జాతర ఏర్పాట్లు బ్రహ్మాండంగా ఉన్నాయి. ముఖ్యంగా అమ్మవారి దర్శనానికి క్యూలైన్ల నిర్వహణ చాలా అద్భుతంగా చేశారు. ఎవ్వరికి ఏ విధమైనటువంటి వీఐపి పాసులు ఇవ్వలేదు. ఇది చాలా అభినందించదగిన విషయం. కనీసం అధికారులను కూడా వీఐపీ ద్వారా అనుమతించలేదు. ఎవరైనా రూ.500, రూ.200 క్యూలైన్‌లలో లేదా ఉచిత దర్శన క్యూ లైన్‌లో వెళ్లి అమ్మవారిని దర్శనం చేసుకోవాల్సిందే..! ఎవ్వరి సిఫారసు చెల్లదు. దళారులు లేరు. ఒక్క ప్రోటోకాల్ వారికి మాత్రమే, అదీ చాలా పరిమిత సంఖ్యలో అనుమతించారు. నేను, నా చిన్నతనం నుండి అంటే దాదాపు నలభై ఏళ్లుగా ఈ జాతరకు వెళ్తున్నాను, గతంలో ఎప్పుడూ ఇంత పకడ్బందీగా, సౌకర్యవంతంగా జరగలేదు. ఇలాంటి నిర్వహణ భవిష్యత్తు జాతరలలో కూడా పాటిస్తే భక్తులకు చాలా ఉపయుక్తంగా ఉంటుంది. ఈ పద్ధతికి నాంది పలికిన నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి అభినందనీయులు...!

**పల్లేటి బాలాజీ, సూళ్లూరుపేట.**

# పవన్ కళ్యాణ్ తొందరపడ్డారు!

అండర్ ట్రయిల్ ఖైదీనెం.7691గా రాజమండ్రి సెంట్రల్ జైల్లో ఉన్న చంద్రబాబు నాయుడిని పరామర్శించి వచ్చిన జనసేనాని, జైలు బయటకి వచ్చి ఆవేశపడి మాట్లాడి తప్పు చేశారనిపిస్తోంది. రాజకీయాలలో సహనం, సంయమనం, స్థిత ప్రజ్ఞత, పరిపక్వత చాలా అవసరం. పవన్‌లో ఇవేమీ ఉన్నట్లు నాకు కనిపించడంలేదు. ఇప్పటికే కేంద్రంలో అధికారంలో వున్న ఒక జాతీయపార్టీతో జతకట్టి వున్న మరో ప్రాంతీయ పార్టీ జనసేన. ఆ జాతీయ పార్టీతో విభేదించిన ఇంకొక ప్రాంతీయ పార్టీ టీడీపీ. అలాంటి టీడీపీతో జనసేన పొత్తు పెట్టుకుని పోటీ చేయబోతోంది అన్నది రాజకీయాలలో అతి పెద్ద నిర్ణయం. సుదీర్ఘ మంతనాలు, పరస్పర ఒప్పందాలు, ఇరు పార్టీల పాలసీలు తదితర అంశాలన్నీ చర్చించుకున్న తరువాత ఒక అంగీకారానికి వచ్చి, ఇరు పార్టీల అధినేతలూ కలిసి ప్రకటించాల్సిన నిర్ణయం అది. అలాంటిది మీడియాను చూడంగానే రెచ్చిపోయి 2024లో మేం కలసి పోటీ చేయబోతున్నాం అని ప్రకటించడం పవన్ కళ్యాణ్ అనుభవ రాహిత్యానికి నిదర్శనం. కమ్మ సామాజిక వర్గంతో కలసిరావడానికి కాపులు సుముఖత చూపిస్తారన్నది అనుమానమే. మొత్తం మీద పవన్ తొందరపడ్డారు..!

**కె.లక్ష్మీపతి, కాకినాడ.**




# మూగజీవాల పట్ల కరుణ చూపాలి

ప్రతిఏటా అక్టోబర్‌లో మనం జంతు సంరక్షణ దినోత్సవం జరుపుకుంటున్నాం. సంతోషం. కానీ, ఆ మూగజీవాల పట్ల ఏమాత్రం కరుణ చూపుతున్నామో ఎవరికి వారు ఆలోచించుకోవాలి. ఆకలిదప్పులతో జింకలు, దుప్పులు జనారణ్యాల్లోకి వచ్చి కుక్కల బారిన పడుతుండడం తెలిసిందే. అడవుల్లోనే వాటి దాహార్తి తీర్చేందుకు అటవీ అధికారులు చర్యలు చేపట్టాలి.

**ఎస్ఎస్ పట్టాభిసీతారామయ్య, ఉదయగిరి.**




# మాయమవుతున్న మానవత్వం

## మృగత్వంగా మారుతున్న మనిషి తత్వం

ఇటీవలి కాలంలో మనుషులలో మానవత్వం మాయమై, మృగత్వం పెరిగిపోతోంది. ముఖ్యంగా మహిళలపై అత్యాచారాల సంఖ్య రోజురోజుకి ఎక్కువైపోతోంది. జాతీయ నేర గణాంక బృందం (నేషనల్ క్రైమ్ రికార్డ్స్ బ్యూరో) 2021 సంవత్సర వార్షిక లెక్కలప్రకారం ఆ ఒక్క ఏడాదే దేశవ్యాప్తంగా 31,677 మానభంగం కేసులు నమోదు కాబడ్డాయి. అంటే, దేశంలోని వివిధ ప్రాంతాలలో సగటున రోజుకి 86 అత్యాచారాలు జరుగుతున్నాయి. ఈ సంఖ్య 2019లో 32,033గా ఉంటే 2020లో 28,046కి తగ్గి మళ్ళీ 2021లోనూ ఆ తరువాత కాలంలోనూ గణనీయంగా పెరిగిపోయింది. కాశ్మీరు నుండి కన్యాకుమారి వరకు నిత్యం ఎక్కడో ఒక చోట మహిళలపై అత్యాచారాలు, హత్యలు అంటూ వార్తలు వింటూనే ఉన్నాం, పలు మీడియాలలో కథనాలు చదువుతూనే ఉన్నాం.

వార్తల వేటలో పోటీపడుతున్న ఎలక్ట్రానిక్ మీడియా కూడా ఒక్కొక్కసారి విచిత్ర పోకడలు పోతోంది. ఇటీవల ఒక తెలుగు న్యూస్‌ఛానల్ ఉజ్జయినిలో జరిగిన మానభంగం సంఘటనను చంద్రయాన్ ప్రయోగంతో పోలుస్తూ కథనాన్ని చూపించారు. చంద్రుడిపై వాలేంత సాంకేతిక సామర్థ్యం, మేధావులు ఉన్న సమాజంలో మహిళలు మానభంగాలకి గురవుతున్నారు, పురుష ప్రపంచం మానవీయతను కోల్పోతోంది అన్నది ఆ కథనం సారాంశం. ఈ పోలిక విడ్డురంగా గాడిదని, గుర్రాన్ని ఒకే గాటన కట్టేసినట్లుగా ఉంది. తప్పతాగి ఉచ్చం నీచం మరచి కామంతో కళ్ళు మూసుకుపోయి అకృత్యాలకు, మహిళలపై అఘాయిత్యాలకు పాల్పడే కిరాతకులను నియంత్రించడాన్ని రాకెట్ సైన్సుతో పోల్చడం సరికాదు.

మద్యం మత్తులోనో, క్షణికావేశంలోనో కామంతో కళ్ళుమూసుకుపోయే పైశాచిక మగాళ్ల అకృత్యాలు నియంత్రించడం అన్నది ఏ ఒక్క ప్రభుత్వానికో, వ్యవస్థకో సాధ్యమయ్యే పని కాదు. ప్రభుత్వాలు కూడా తమకి సాధ్యమైనంతవరకు ఈ అఘాయిత్యాలని నివారించడానికి నిర్భయ, దిశ లాంటి చట్టాలను రూపొందించి కృషి చేస్తూనే ఉన్నాయి. మనుషుల్లోనే మార్పు రావాలి. అకృత్యాలకు గురవుతోంది మనలాంటి సాటి మనిషే అన్న తలంపు రావాలి. జరిగే సంఘటనను నియంత్రించలేకపోయినా దుర్ఘటనకు గురైన వ్యక్తిని ఆదరించి అక్కున చేర్చుకోగలిగిన సహృదయత కావాలి. ఉదాహరణకి... మొన్న ఉజ్జయినిలో జరిగిన సంఘటననే తీసుకుంటే, మానభంగానికి గురైన బాలిక దయనీయ పరిస్థితులలో వీధులలోకి వస్తే, ఆమె దరిదాపులకు వెళ్ళడానికి కూడా ఎవరూ ముందుకురాలేదు. పూర్తిగా వివస్త్రగా మారి నిస్సహాయ స్థితిలో గడపగడపకి వెళ్తే కనీసం జాలి, దయ, కరుణ చూపించి ఆమెకి ఒక వస్త్రాన్ని కూడా అందించలేని అచేతన స్థితిలో సిగ్గులేని మానవ సమాజం ఉండిపోయింది. ఆ సంఘటన గురించి విన్నప్పుడు, సామాజిక మాధ్యమాలలో ఆ అబల మానసికవ్యథ చూసినప్పుడు...

సుమారు నాలుగు దశాబ్దాల క్రితం 1985లో ఇదే అక్టోబర్ 11న విడుదలైన "ప్రతిఘటన" సినిమాలో ఆ రోజుల్లోనే సమాజంలో ఉన్న వాస్తవ పరిస్థితులకి, మహిళాలోకం అనుభవిస్తున్న మనోవేదనకి అద్దంపడుతూ వేటూరి సుందరరామమూర్తి వ్రాసిన దిగువ పాట గుర్తొస్తోంది...

***"ఈ దుర్యోధన దుశ్శాసన దుర్వినీత లోకంలో***
***రక్తాశ్రులు చిందిస్తూ రాస్తున్నా శోకంతో***
***మరో మహాభారతం... ఆరవ వేదం***
***మానభంగ పర్వంలో... మాతృహృదయ నిర్వేదం"....***

అంటూ ముప్పై ఎనిమిదేళ్ల క్రితమే సమాజంలో ఉన్న పరిస్థితులపై వేటూరి వ్రాసిన పాట ఇది. ఈ నాలుగు దశాబ్దాల కాలంలో ప్రపంచం సాంకేతికపరంగా ఊహించనంత మారింది. మనుషుల అలవాట్లు మారాయి, వసతులూ సౌకర్యాలూ పెరిగాయి, అంతర్జాలం పుణ్యమా అని ప్రపంచం అరచేతిలోకి వచ్చింది. కానీ, మగజాతి నైజం మారలేదు, బుద్ధిలో మార్పు రాలేదు, కలియుగం కలుషిత యుగం అనిపించేలా ఒకదాని తరువాత ఒకటి అత్యాచార ఘటనలు జరుగుతూనే ఉన్నాయి.

వీటిని అరికట్టడం అసాధ్యం అయినా, అలా ఆలోచన కలిగినవాడికి వణుకు పుట్టేలా ప్రభుత్వాలు కూడా కొన్ని చర్యలు తీసుకోవాలి. గల్ఫ్ దేశాల తరహా చట్టాలు మన దేశంలో కూడా అమలుపరచాలి. పరాయి స్త్రీని కన్నెత్తి చూడడానికి కూడా భయపడే విధంగా శిక్షలు ఉండాలి. చట్టసభలలో మహిళలకి 33 శాతం రిజర్వేషన్ కల్పించిన ప్రభుత్వాలు, వారి మాన ప్రాణాలకి రక్షణ కల్పించేలా భారతీయ శిక్షాస్మృతిలో కూడా మార్పులు చేయాలి. అలాగే ఇలాంటి దుశ్చర్యలని అడ్డుకోకపోగా, తమ సెల్‌ఫోన్‌లలో బంధించి సామాజిక మాధ్యమాలలో పోస్ట్ చేస్తున్న వారిని గుర్తించి వారిపై కూడా కఠిన చర్యలు తీసుకోవాలి. జరుగుతున్న దుర్ఘటనని తమ సెల్‌ఫోన్‌లో బంధించడానికి బదులుగా వాటిని నివారించడానికి, అడ్డుకోవడానికి అవసరమైన చర్యలు తీసుకునేవిధంగా వారికి శిక్షణ ఇవ్వాలి. ప్రజలు కూడా బాధ్యతంతా నాయకులది, ప్రభుత్వాలది అన్నట్లు కాకుండా సామాజిక స్పృహ కలిగి చైతన్యవంతులు కావలసిన అవసరం ఉంది. ఈ దేశం నాది, ఈ సమాజం మనది, సమసమాజ స్థాపన బాధ్యత మనందరిదీ అని ప్రతి పౌరుడు భావించినప్పుడే ఇలాంటి అనేక అరాచకాలకు ముగింపు పడుతుంది. పక్కవాడికి ఏం జరిగినా మనకెందుకులే అని చూస్తూ కూర్చుంటే ఏదో ఒక రోజు అదే సంఘటన మనకో, మన కుటుంబ సభ్యులకో ఎదురౌతుంది. తస్మాత్ జాగ్రత్త..!

**- రాజశ్రీ**

# దేవీ శరన్నవరాత్రులను.. దేదీప్యమానంగా నిర్వహించాలి



నెల్లూరు దర్గామిట్టలో కొలువైవున్న శ్రీ రాజరాజేశ్వరిదేవి అమ్మవారి ఆలయంలో అక్టోబరు 15 నుంచి 23వ తేది వరకు దేవీ శరన్నవరాత్రులను అంగరంగ వైభవంగా, దేదీప్యమానంగా నిర్వహించాలని నెల్లూరు ఎంపీ, నెల్లూరు రూరల్ వైకాపా ఇన్‌చార్జి ఆదాల ప్రభాకరరెడ్డి అధికారులను ఆదేశించారు. అందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. ఇటీవల ఆయన అమ్మవారి ఆలయంలో అధికారులతో ముందస్తు ఏర్పాట్ల విషయమై చర్చించారు. ఈ ఉత్సవాల్లో ఎక్కడా భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకూడదని ఆయన స్పష్టం చేశారు. కార్పొరేషన్ అధికారులు పారిశుద్ధ్యం విషయంలో తగు జాగ్రత్తలు తీసుకోవాలని, తాగునీటికి ఇబ్బంది లేకుండా పర్యవేక్షించాలని సూచించారు. ఆలయం వద్ద పోలీసు బందోబస్తు ఏర్పాటుచేయడంతో పాటు కమాండ్ కంట్రోల్ రూమ్‌ను కూడా ఏర్పాటుచేసి భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా చూడాలన్నారు. ఆలయం నిర్వాహకులు అధికారులతో సమన్వయం చేసుకుంటూ ఉత్సవాలను విజయవంతం చేయాలన్నారు. ఈ సమావేశంలో నగర మేయర్ పొట్లూరి స్రవంతి, కార్పొరేషన్ కమిషనర్ వికాస్ మర్మత్, ఆర్డీఓ మలోలా, దేవాదాయశాఖ అధికారి జె.శ్రీనివాసులు, ఆలయ ఇఓ శ్రీనివాసులురెడ్డి, విజయ డెయిరీ ఛైర్మెన్ కొండ్రెడ్డి రంగారెడ్డి, ధర్మకర్తల మండలి ఛైర్మెన్ రత్నం జయరామ్, వైకాపా నాయకుడు సన్నపురెడ్డి పెంచలరెడ్డి, 28వ డివిజన్ ఇన్‌చార్జి నెల్లూరు మదన్‌మోహన్‌రెడ్డి, కార్పొరేటర్లు ఒరిస్సా శ్రీనివాసులురెడ్డి, మూలే విజయభాస్కర్ రెడ్డి, మల్లికార్జునయాదవ్, ఆలయ కమిటీ సభ్యులు, అధికారులు పాల్గొన్నారు.

## సీఐడీ అధికారుల ఆధ్వర్యంలో..
# గిరిజనులకు చట్టాలపై అవగాహన





నెల్లూరులోని సీఐడీ విభాగం అధికారులు గిరిజనులకు చట్టాల పట్ల అవగాహన కల్పించారు. తోటపల్లిగూడూరు మండలం మల్లికార్జునపురంలో ఇటీవల జరిగిన అవగాహన సదస్సులో సీఐడీ ఎస్పిఆర్‌ఓ కవేణుగోపాల్ అధ్యక్షత్వంలో, సీఐడీ డీఎస్పీ వివిస్ రాంబాబు, ఐటీడీఏ పీఓ డా. రాణి, నెల్లూరు రూరల్ డీఎస్పీ వీరాంజనేయరెడ్డి, సీఐడీ ఎస్ఐ మానిష తదితరులు మాట్లాడుతూ, గిరిజనులు విద్యలో రాణించాలని, చట్టాలను అవగాహన చేసుకుని జీవితంలో ఉన్నతస్థాయికి చేరాలని చెప్పారు. ముఖ్యంగా గిరిజన బాలికలు బాగా చదువుకుని ఉజ్వల భవిష్యత్తును పొందాలన్నారు. గిరిజనులు తమకేదైనా అన్యాయం జరిగితే ధైర్యంగా పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదుచేసి న్యాయపరంగా తమ సమస్యలు పరిష్కరించుకోవచ్చన్నారు. వారికి తమనుంచి పూర్తిసహాయ సహకారాలుంటాయని భరోసా ఇచ్చారు. జిల్లా గిరిజన సంక్షేమసంఘం అధ్యక్షుడు బీఎల్ శేఖర్, మానిటరింగ్ కమిటీ సభ్యులు శ్రీనివాసులు, గిరిజన నాయకులు సుబ్రహ్మణ్యం, ఇండ్ల రవి, తహశీల్దార్ లావణ్య, ఎంపీడీఓ హేమలత, కృష్ణపట్నం సీఐ వెంకటేశ్వరరెడ్డి, ఎస్ఐ కుమార్, సీఐడీ విభాగం ఉద్యోగులు పాల్గొన్నారు.

# జడ్పీ విద్యార్థులకు 'స్పందన' బహుమతులు



ఇటీవల పదో తరగతిలో ఉత్తమ మార్కులు సాధించిన, నగరంలోని పొదలకూరు రోడ్డులో ఉన్న జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులకు స్పందన ఫౌండేషన్ నిర్వాహకులు నగదు పురస్కారాలను అందజేశారు. 500కు పైగా మార్కులు సాధించిన 21మంది బాలబాలికలకు ఒక్కొక్కరికి 5వేల రూపాయల వంతున ప్రోత్సాహక బహుమతులిచ్చారు. డెప్యూటీ డిఇఓ ప్రసన్నలక్ష్మి, ఎంఇఓ మురళి, స్పందన ఫౌండేషన్ కార్యదర్శి సురేష్‌బాబు, మునిసిపల్ లీగల్ స్టాండింగ్ కమిటీ సభ్యుడు రంగారావు, ప్రపంచ తెలుగుసమాఖ్య రీజనల్ కోఆర్డినేటర్ నలుబోలు బలరామయ్యనాయుడు, జడ్పీ వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి, ప్రధానోపాధ్యాయుడు కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# కమనీయం.. మల్లాం శ్రీ సుబ్రహ్మణ్యేశ్వరుని కల్యాణం



చిట్టమూరు మండలం మల్లాంలో వెలసివున్న ప్రఖ్యాతమైన వల్లీ దేవసేన సమేత శ్రీ సుబ్రహ్మణ్యేశ్వరస్వామి వారి దేవాలయంలో జరుగుతున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఈనెల 3న స్వామివారి కల్యాణోత్సవం కమనీయంగా జరిగింది. మంగళవాద్యాలు, వేదమంత్రోచ్చారణల మధ్య వేదపండితులు శాస్త్రోక్తంగా నిర్వహించిన ఈ ఉత్సవంలో పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివార్లను దర్శించుకున్నారు. ఈ సందర్భంగా శ్రీకాళహస్తీశ్వరస్వామి దేవస్థానం నుంచి స్వామి, అమ్మవార్లకు పట్టువస్త్రాలను అందజేశారు.

## 'విశ్వకర్మ యోజన'కు
# దరఖాస్తు చేసుకోండి


ప్రధాని నరేంద్రమోడీ ఇటీవల ప్రవేశపెట్టిన విశ్వకర్మ యోజన పథకానికి దరఖాస్తు చేసుకోవాలని విశ్వకర్మ యోజన జిల్లా కన్వీనర్ ఆర్కాట్‌కుమార్ చెప్పారు. ఇటీవల నగరంలోని తన కార్యాలయంలో ఆయన ఆ పథకం ఎలా పొందాలో వివరించారు. 18 సంవత్సరాలు నిండి, 59 సంవత్సరాల లోపు ఉన్న చేతివృత్తిదారులు, వారు ఏ కులమైనా, ఏ మతమైనా తమ పేర్లు నమోదు చేసుకోవచ్చన్నారు. ఫోన్‌కు లింక్ అయిన ఆధార్‌కార్డు, రేషన్‌కార్డు, పాన్‌కార్డు, బ్యాంకు పాస్‌బుక్‌తో పాటు కుటుంబసభ్యుల్లోని మరొకరి ఆధార్ కార్డుతో సీఎస్‌సి సెంటర్, మీ-సేవ కేంద్రాల్లో, స్థానిక కొరదావీధిలోని కార్యాలయంలో పేర్లు నమోదు చేసుకోవచ్చని తెలిపారు. అర్హత పొందినవారికి వారి వృత్తుల్లో శిక్షణ ఉంటుందని, శిక్షణ పూర్తయ్యాక ధృవీకరణపత్రం, గుర్తింపు కార్డు, 15వేల రూపాయల విలువచేసే సామాగ్రి ఇస్తారని, ఈ ప్రక్రియ పూర్తయిన తర్వాత, వారు నమోదుచేసుకున్న బ్యాంకు నుంచి లక్ష రూపాయల రుణం పొందే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. అర్హత కలిగిన ప్రతిఒక్కరూ ఈ పథకానికి దరఖాస్తు చేసుకుని, పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

## 10న.. జడ్పీ
# స్థాయీసంఘ సమావేశాలు

నెల్లూరు జిల్లా పరిషత్ స్థాయీ సంఘ సమావేశాలు ఈనెల 10వ తేదీన నిర్వహించనున్నట్లు జడ్పీ సిఇఓ చిరంజీవి ఒక ప్రకటనలో తెలిపారు. జడ్పీ సమావేశ మందిరంలో జరిగే ఈ సమావేశాలకు జడ్పీ సభ్యులు, ఆయాశాఖల అధికారులు హాజరుకావాలని ఆయన కోరారు.

# ఉత్తమ సేవలకు.. ప్రతిష్ఠాత్మక అవార్డు

## ❍ రాష్ట్రపతి చేతులమీదుగా సాత్వికకు పురస్కారం



స్వచ్ఛంద సేవలకు గుర్తింపుగా ప్రతిఏటా కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడలశాఖ ప్రదానం చేసే జాతీయ సేవాపథకం అవార్డును 2021-22 సంవత్సరానికి రాష్ట్రానికి చెందిన ఇద్దరు విద్యార్థులు దక్కించుకోగా, వారిలో ఒకరు నెల్లూరుజిల్లాకు చెందిన విద్యార్థిని కావడం విశేషం. ఎన్ఎస్ఎస్ దినోత్సవం సందర్భంగా ఇటీవల ఢిల్లీలో జరిగిన కార్యక్రమంలో భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతులమీదుగా సాత్విక ఈ ప్రతిష్ఠాత్మకమైన అవార్డును అందుకోవడం జిల్లాకే గర్వకారణం.

ముత్తుకూరు మండలం జంగాలకండ్రిగకు చెందిన పెళ్ళకూరు వెంకటశేషయ్య -మాధవిల కుమార్తె సాత్విక, నెల్లూరులోని విక్రమసింహపురి యూనివర్సిటీ పరిధిలో ఉన్న అనుబంధ డిగ్రీ కాలేజీ జగన్స్ డిగ్రీ కళాశాలలో బీఎస్సీ కంప్యూటర్స్ పూర్తిచేసింది. ఎన్ఎస్ఎస్ ద్వారా మూడేళ్లపాటు రక్తదానం, పచ్చదనం-పరిశుభ్రత, మొక్కలు నాటడం, ఆజాదీ కా అమృత్ మహోత్సవ్ వంటి వివిధ సేవా కార్యక్రమాల్లో పాల్గొంది. డిజిటల్ ఇండియా, డిజిటల్ అక్షరాస్యత, ప్రధానమంత్రి ఉజ్వల యోజన, పీఎం జీవన్‌జ్యోతి యోజన, పీఎం జీవన్ బీమా యోజన, తదితర పథకాల ప్రచార కార్యక్రమాల్లోనూ చురుగ్గా పాల్గొనడమే కాక, లాక్‌డౌన్ సమయంలో పేదలకు విశేష సేవలందించింది. పర్యావరణ పరిరక్షణకు 1500 మొక్కలు నాటడంతోపాటు, పలు రక్తదాన శిబిరాల్లోనూ పాల్గొంది. సాత్విక సామాజిక సేవలకు గుర్తింపుగా కేంద్రం ఈ అవార్డును ప్రకటించగా, రాష్ట్రపతి నుంచి ఆమెకు ఈ అరుదైన పురస్కారం లభించింది.

## చంద్రబాబు జైల్లో ఉన్నా..
# ప్రజల సంక్షేమాన్నే కోరుకుంటున్నారు

### - వెంకటగిరి ఎమ్మెల్యే, మాజీమంత్రి ఆనం రామనారాయణ



చంద్రబాబును తప్పుడు ఆరోపణలతో జైల్లో పెట్టారని, అయితే చంద్రబాబు జైల్లో ఉన్నా రాష్ట్ర ప్రజల సంక్షేమం గురించే ఆలోచిస్తున్నారని, ఆయన్ను పరామర్శించేందుకు జైలుకు వెళ్లిన నాయకులతో ప్రజల బాగోగుల గురించే అడుగుతున్నారని, మాజీమంత్రి, వెంకటగిరి ఎమ్మెల్యే ఆనం రామనారాయణరెడ్డి చెప్పారు. చంద్రబాబునాయుడు అరెస్టుకు నిరసనగా ఇటీవల మండల కేంద్రమైన చేజర్లలో జరిగిన భారీర్యాలీలో ఆయన పాల్గొన్నారు. అనంతరం రిలే నిరాహారదీక్ష శిబిరం వద్ద ఆనం మాట్లాడుతూ, ఒక మంచి పని జరిగేముందు చెడు జరగడమన్నది పురాణకాలం నుంచి వస్తున్నదేనని, క్షీరసముద్రాన్ని మథించినప్పుడు ముందుగా కాలకూట విషం వచ్చాకే అమృతభాండం వచ్చిందని అంటూ, అదేవిధంగా ఆంధ్ర రాష్ట్రంలో రానున్న ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ ఘనవిజయం సాధించడం, తద్వారా మంచిపనులకు, రాష్ట్రాభ్యున్నతికి శ్రీకారం చుట్టడం జరుగుతుందని ధీమా వ్యక్తం చేశారు. మహాత్మా గాంధీజీ తెచ్చిన స్వాతంత్ర్యం ఇప్పుడు రాష్ట్రంలో లేదని, రాష్ట్రంలో ఇప్పుడు దుర్మార్గమైన అరాచక పాలన సాగుతోందని ఆయన దుయ్యబట్టారు.

# అధోగతిలో అన్నపూర్ణ ఆంధ్ర



సోమిరెడ్డి ఆవేదన

స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ పనితీరు సక్రమంగా ఉందని సిఎం జగన్‌మోహన్‌రెడ్డి నియమించిన ఛైర్మనే చెప్పారని ఈ ఆందోళనలో పాల్గొన్న మాజీమంత్రి, టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి అన్నారు. 42 స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్లలో కంప్యూటర్లు ఇతర సాంకేతిక పరికరాలు ఏర్పాటుచేయడం జరిగిందన్నారు. అన్నపూర్ణ లాంటి ఆంధ్రదేశం ఇప్పుడు అధోగతి పాలౌతున్నదంటూ ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఆందోళనలో నాయకులు ఆనం రంగమయూర్‌రెడ్డి, చేజర్ల నాయకులు రావి లక్ష్మీనరసారెడ్డి, వేలూరు కేశవచౌదరి, పెంచలనాయుడు, అచ్చాల నారాయణరెడ్డి, పలువురు ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు, జనసేన, సీపీఎం, సీపీఐ పార్టీల నాయకులు, పవన్‌కల్యాణ్-బాలకృష్ణ అభిమానులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

# నెల్లూరు కబుర్లు



## మాటలతో కాదు..చేతలతో మార్గదర్శకం

### చీపుర్లు చేతబట్టి చెత్తను తొలగించిన ఎంపీలు

పరిశుభ్రతతోనే స్వచ్ఛత ఏర్పడుతుందని కేవలం పిలుపునిచ్చి సరిపెట్టుకోవడం కాక, స్వయంగా చీపుర్లు చేతపట్టి చెత్తను శుభ్రం చేసి అందరికీ ఆదర్శంగా నిలిచారు మన ఎంపీలు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఆదాల ప్రభాకర్‌రెడ్డి. ఈనెల 1న నెల్లూరు కార్పొరేషన్ ఆధ్వర్యంలో స్థానిక గణేష్‌ఘాట్‌లో నిర్వహించిన 'స్వచ్ఛతా హి సేవ' కార్యక్రమంలో వారు పాల్గొని చెత్తను తొలగించారు. ప్రజలకు పారిశుద్ధ్య పరిరక్షణ ప్రాధాన్యతను వివరించారు. ప్రతిఒక్కరూ పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించాలని, పర్యావరణాన్ని పరిరక్షించాలని హితవు పలికారు. ఈ సందర్భంగా విపిఆర్ మాట్లాడుతూ, పరిసరాల శుభ్రత లేకుండా ప్రజలు ఆరోగ్యంగా ఉండటం సాధ్యం కాదన్నారు. ఈ దేశాన్ని, రాష్ట్రాన్ని స్వచ్ఛంగా తీర్చిదిద్దుకునేందుకు అందరూ చిత్తశుద్ధితో నడుం బిగించాలన్నారు. ఈ కార్యక్రమంలో మేయర్ పొట్లూరి స్రవంతి, డెప్యూటీ మేయర్ రూప్‌కుమార్‌యాదవ్, నగరపాలక కమిషనర్ వికాస్ మర్మత్ తదితరులు పాల్గొన్నారు.

## భక్తిశ్రద్ధలతో కాత్యాయినీ వ్రతం



నెల్లూరు దర్గామిట్ట లోని శ్రీ రాజరాజేశ్వరి దేవి అమ్మవారి దేవాలయంలో శ్రావణ మాసం మంగళవారాల్లో జరుగుతున్న కాత్యాయని వ్రతాల్లో భాగంగా ఈనెల 3న ఏడవ మంగళవారం నాడు సామూహిక కాత్యాయని వ్రతాన్ని ఆలయ ప్రధాన అర్చకుడు రఘురామశర్మ ఆధ్వర్యంలో నిర్వహించారు. మహిళాభక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని వ్రతాన్ని చేపట్టి, అమ్మవారిని దర్శించుకున్నారు. ధర్మకర్తల మండలి అధ్యక్షులు రత్నం జయరామ్, ఇఓ ఏ.వి శ్రీనివాసులురెడ్డి, ధర్మకర్తల మండలి సభ్యులు పర్యవేక్షించారు.

## వృద్ధులకు అండగా ఉందాం

**- సీనియర్ సివిల్ జడ్జి కె.వాణి**



వయోవృద్ధులకు అన్ని విధాలా అండగా ఉండి, ప్రతి ఒక్కరూ వారికి తగు తోడ్పాటు అందించాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సెక్రటరీ, సీనియర్ సివిల్ జడ్జి కె.వాణి పిలుపునిచ్చారు. ఈనెల 3న నెల్లూరులోని అంబేద్కర్ భవన్‌లో విభిన్న ప్రతిభావంతులు, వృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రపంచ వయోవృద్ధుల దినోత్సవంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, జిల్లాలో అనేకమంది వృద్ధులు వృద్ధాశ్రమాల్లో ఉండడం చాలా బాధాకరమని, వృద్ధులను ఇబ్బంది పెట్టకుండా వారి అవసరాలను తీర్చాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. వృద్ధులకు ఏ చిన్న సమస్య వచ్చినా వారికి సహాయ సహకారాలు అందించేందుకు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఎప్పుడూ ముందుంటుందని, వృద్ధులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ఆమె చెప్పారు. ఈ కార్యక్రమంలో విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధుల శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ అక్బర్ అలీ, రాష్ట్రప్రభుత్వ ఉద్యోగుల సంఘం జనరల్ సెక్రెటరీ లక్ష్మీనారాయణ, ఓల్డ్ ఏజ్ హోం అసోసియేషన్ ప్రెసిడెంట్ రవూఫ్, పి.కొండయ్య తదితరులు పాల్గొన్నారు.

## మహాత్మునికి... విఆర్‌సి వాకర్స్ నివాళి




గాంధీ జయంతి సందర్భంగా అక్టోబరు 2న నెల్లూరులోని విఆర్‌సి వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో విఆర్‌సి గ్రౌండ్‌లో వాకర్స్ ప్రతినిధులు మహాత్ముని చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. దేశ స్వాతంత్య్ర సిద్ధి కోసం అహింసామార్గం ద్వారా శాంతియుతంగానే జాతిపిత మహాత్మాగాంధీజీ చేసిన వీరోచిత పోరాటాన్ని ఈ సందర్భంగా బాలలకు వివరించారు. అనంతరం పిల్లలందరికీ చాక్లెట్లు పంచారు. విఆర్‌సి వాకర్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ లక్ష్మీకుమార్‌రెడ్డి, వైస్ ప్రెసిడెంట్, అమ్మా ఫర్నిచర్ మాల్ అధినేత గడ్డం సుధాకర్‌రెడ్డి, డాక్టర్ ఈశ్వర రెడ్డి, డాక్టర్ పెంచలయ్య, డాక్టర్ భాస్కర్‌రావు, న్యాయవాది నన్నేసాహెబ్ తదితరులు పాల్గొన్నారు.



## సత్తా చాటిన నెల్లూరు క్రికెట్ జట్టు

ఇటీవల కడపలో జరిగిన ఇంటర్‌జోన్ క్రికెట్ పోటీల్లో నెల్లూరుజిల్లా జట్టు సత్తాచాటింది. సౌత్, నార్త్, సెంట్రల్ జోన్‌లతో పాటు కృష్ణా-విజయనగరం జిల్లాల జట్లు కూడా ఈ పోటీల్లో పాల్గొన్నాయి. ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ ఇంటర్ జోనల్ అండర్-23 విభాగంలో జరిగిన ఈ పోటీల్లో నెల్లూరుజట్టు అత్యంత ప్రతిభతో రాణించి చాంపియన్‌షిప్ సాధించింది. జిల్లా క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి డి.నిఖిలేశ్వర్‌రెడ్డి తదితరులు నెల్లూరుజట్టును అభినందించారు.

## కెవి చలమయ్యను సన్మానించిన ఆర్డీఓ



ప్రపంచ వృద్ధుల దినోత్సవం సందర్భంగా నెల్లూరులోని స్వాతంత్ర్య సమర యోధుడు కెవి చలమయ్యను ఆర్డీఓ మలోలా, ఘనంగా సన్మానించారు. ఈనెల 1న చలమయ్య నివాసానికి ఆర్డీఓ, ఏఓ మధుసూదన్‌శర్మలు వెళ్ళి ఆయన్ను అభినందించి సన్మానించారు.

## ఎన్‌సిసి క్యాడెట్ల శ్రమదానం




భారత ప్రధానమంత్రి నరేంద్ర మోడీ పిలుపు మేరకు, నెల్లూరులోని 10-ఆంధ్ర నావెల్ యూనిట్ ఎన్‌సిసి లెఫ్టినెంట్ కమాండర్ వినయ్ రామచంద్రన్ ఆదేశాలతో నగరంలోని కెఎన్ఆర్ నగరపాలక ఉన్నత పాఠశాల ఎన్‌సిసి అధికారి గుండాల నరేంద్రబాబు ఆధ్వర్యంలో ఈనెల 1న 'ఏక్ తారీక్-ఏక్ గంట శ్రమదాన్' కార్యక్రమాన్ని నిర్వహించారు. పాఠశాల వద్ద నుంచి కరెంట్ ఆఫీస్ కూడలిలోని సర్దార్ వల్లభాయ్ పటేల్ విగ్రహం వరకు 'స్వచ్ఛతాహి సేవ' ర్యాలీ చేపట్టారు. ఎన్‌సిసి క్యాడెట్లు శ్రమదానం చేసి, పరిసరాల్లో ఉన్న చెత్తాచెదారాన్నంతా ఏరివేసి పరిశుభ్రం చేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎం.విజయప్రకాష్ రావు తదితరులు పాల్గొని ఎన్‌సిసి క్యాడెట్ల సేవలను అభినందించారు.

## 'తంగిరాల మహాభారతం' 75వ భాగం




ధర్మరాజు సోదరులతో, పరివారంతో హస్తినాపురం వెళ్లి నూతన సభా భవనాన్ని సందర్శించినప్పుడు దుర్యోధనుడు కాలక్షేపం కోసం స్నేహజూదం ఆడదామంటాడు. కానీ, ధర్మరాజు అంగీకరించక అలాంటి వాటికి క్షత్రియులు దూరంగా ఉండాలి అన్నప్పుడు... శకుని ధర్మరాజుని ఆడటానికి భయపడుతున్నావని కవ్విస్తాడు. అప్పుడు ధర్మరాజు పౌరుషంతో అంగీకరించి జూదం మొదలుపెడతాడు.

కానీ, శకుని వేసే పాచికలతో ధర్మరాజు ప్రతి పందేన్ని ఓడిపోతాడు. తనకున్న సమస్త ఐశ్వర్యం, దాస దాసీ జనం, వేలకొలది గుర్రాలు, ఏనుగులు, ఆవులు, గేదెలు, మేకలు మొదలగు జంతువులను పణంగాపెట్టి ఓడిపోతాడు. విదురుడు ఇది చూసి కలవరపడి, ధృతరాష్ట్రుణ్ణి హెచ్చరిస్తాడు... ఘోరం జరగబోతోంది, ఆ జూదాన్ని ఆపేయమని. కానీ, ధృతరాష్ట్రుడు విదురుని మాటలు పట్టించుకోకుండా మౌనంగా ఉండిపోతాడు.

విదురుడు, దుర్యోధనుని దగ్గరకు వెళ్లి పాండవుల సంపత్తి ఇలా మాయా జూదంలో అపహరించటం అన్యాయమని అన్నప్పుడు దుర్యోధనుడు విదురుణ్ణి కసిరి అవమానిస్తాడు.

**భారత కాలమానం ప్రకారం ప్రతి శనివారం ఉదయం యూట్యూబ్‌లో తంగిరాల 'మహాభారతం' అందుబాటులోకి వస్తుంది. పూర్తి నిడివి కోసం Syam Tangirala Mahabharatam @YouTubeలో చూడగలరు.**




## నెల్లూరు జ్యోతిష్యునికి.. అరుదైన పురస్కారం



నెల్లూరుకు చెందిన ప్రముఖ జ్యోతిష్యులు వేమూరు గోపీనాథ్‌శర్మకు అరుదైన పురస్కారం లభించింది. హైదరాబాద్‌లోని మేడిపల్లి ఎం కన్వెన్షన్ హాల్‌లో ఈనెల 1న బ్రాహ్మణ సంక్షేమ వేదిక తృతీయ వార్షికోత్సవం సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో జ్యోతిష్య రంగంలో చేస్తున్న విశేష సేవలకు గుర్తింపుగా ఆయనకు 'జ్యోతిష్య ప్రముఖ్'గా అవార్డునిచ్చి ఘనంగా సత్కరించారు.

## ఫ్రెండ్స్ వాకర్స్ ఆధ్వర్యంలో.. గాంధీ జయంతి



అక్టోబరు 2 గాంధీ జయంతి, లాల్‌బహాదూర్‌శాస్త్రి జయంతిల సందర్భంగా నెల్లూరులోని ఫ్రెండ్స్ వాకర్స్ అసోసియేషన్ వారు వేడుకలు నిర్వహించారు. స్థానిక ఏసి సుబ్బారెడ్డి స్టేడియంలో జరిగిన ఈ కార్యక్రమంలో వక్తలు మహాత్మాగాంధీ, లాల్‌బహాదూర్ శాస్త్రిలు దేశానికి చేసిన సేవలను కొనియాడారు. స్వాతంత్ర్యసమరంలో గాంధీజీ చేసిన పోరాటం, ఆయన త్యాగం ఏనాటికీ మరువలేనివన్నారు. అసోసియేషన్ అధ్యక్షులు తలపనేని హరిబాబునాయుడు, కార్యదర్శి బిరుదవోలు రామమోహన్‌రెడ్డి, కోశాధికారి షేక్ నజీర్ అహమ్మద్, వాకర్స్ ప్రతినిధులు నలుబోలు బలరామయ్యనాయుడు, పత్తిపాటి రమణయ్య, సుబ్బారావు, ప్రసాద్‌నాయుడు, వినుకొండ వెంకటేశ్వర్లు, జివి కృష్ణయ్య, కిలారి శ్రీనివాసులునాయుడు తదితరులు పాల్గొన్నారు.

# మొగిలిచర్లలో..విపిఆర్ 'అమృతధార'

## - వాటర్‌ప్లాంట్‌ను ప్రారంభించిన వేమిరెడ్డి



వైకాపా జిల్లా అధ్యక్షులు, రాజ్యసభ సభ్యులు, సేవాభూషణులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి తమ వీపీఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈనెల 2న నెల్లూరుజిల్లా కందుకూరు నియోజకవర్గం మొగిలిచర్ల గ్రామంలో 'అమృతధార' వాటర్‌ప్లాంట్‌ను ప్రారంభించారు. తొలుత ఆయన కందుకూరు పట్టణంలోని గ్రామదేవత శ్రీ అంకమ్మ తల్లిని దర్శించుకుని, కందుకూరు ఎమ్మెల్యే మానుగుంట మహీధర్‌రెడ్డితో కలిసి మొగిలిచర్ల గ్రామానికి వెళ్లారు. ఈ సందర్భంగా గ్రామస్థులు వారికి పెద్దఎత్తున మంగళవాద్యాలు, బాణసంచా వేడుకల మధ్య పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం వాటర్ ప్లాంట్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ.. మొగిలిచర్లలో తమ వీపీఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేయడం సంతోషంగా ఉందని, అందులోనూ గాంధీ జయంతి నాడు ఈ ప్రారంభోత్సవం నిర్వహించడం ఇంకా ఆనందంగా ఉందని చెప్పారు. విపిఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఇప్పటి వరకు 107 వాటర్ ప్లాంట్లు ఏర్పాటు చేశామని, మరో 15 వరకు ప్లాంట్లు వివిధ దశల్లో ఉన్నాయని, ప్లాంట్‌ల నిర్వహణ కూడా తమ బాధ్యతే అని ఆయన చెప్పారు. 'జగనన్న ఆరోగ్య సురక్ష' ద్వారా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పేద ప్రజల ఇళ్ల వద్దకే వైద్యం తీసుకొచ్చారని, ఆ కార్యక్రమాన్ని ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని విపిఆర్ సూచించారు. వచ్చే ఎన్నికల్లో తాను నెల్లూరు ఎంపీ స్థానానికి పోటీ చేస్తున్నానని, ఎమ్మెల్యేగా మళ్లీ మహీధర్‌రెడ్డిని, ఎంపీగా తనను ప్రజలు ఆశీర్వదించాలని ఆయన కోరారు. అనంతరం మొగిలిచర్ల గ్రామ సమీపంలో ఉన్న శ్రీ దత్తాత్రేయస్వామి ఆలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. నెల్లూరు కార్పొరేషన్ డెప్యూటీ మేయర్ రూప్‌కుమార్ యాదవ్, ఎంపీపీ, సర్పంచ్, గ్రామస్థులు పాల్గొన్నారు.



# గాంధీజీ స్ఫూర్తితో యువత పయనించాలి

జాతిపిత మహాత్మాగాంధీ స్ఫూర్తితో ప్రతిఒక్కరూ దేశ అభ్యున్నతికి ముందుకు సాగాలని నెల్లూరు ఎంపీ, నెల్లూరు రూరల్ ఇన్‌చార్జి ఆదాల ప్రభాకర్‌రెడ్డి చెప్పారు. అక్టోబరు 2న బాపూజీ జయంతిని పురస్కరించుకొని నెల్లూరులోని ఎంపీ కార్యాలయంలో వేడుకలను ఘనంగా నిర్వహించారు. శాంతియుత మార్గంలో దేశానికి స్వాతంత్ర్యం తెచ్చిపెట్టిన మహనీయుడు మహాత్మాగాంధీజీ అని అంటూ, దేశానికి గాంధీజీ చేసిన మహనీయమైన సేవలను ఆయన ఈ సందర్భంగా కొనియాడారు. తొలుత, మహాత్మా గాంధీజీ చిత్రపటానికి పూలమాలవేసి ఘన నివాళులర్పించారు. నేటి యువతీ యువకులు గాంధీజీ చూపిన శాంతిమార్గంలో పయనించి దేశాభివృద్ధిలో భాగస్వాములు కావాలన్నారు. విజయ డెయిరీ ఛైర్మెన్ కొండ్రెడ్డి రంగారెడ్డి, స్వర్ణ వెంకయ్య, పాశం శ్రీనివాస్, సిహెచ్ హరిబాబుయాదవ్, చంద్రమోహన్‌రెడ్డి, కొండేటి నరసింహారావు, పాలకీర్తి రవికుమార్, జీ.వి ప్రసాద్, పొట్లూరి జయవర్ధన్, మల్లిబోయిన వెంకటేశ్వర్లుయాదవ్, సన్నపురెడ్డి వెంకటసుబ్బారెడ్డి, బెల్లంకొండ వెంకయ్య తదితరులు పాల్గొన్నారు.


# శ్రీసిటీలో రూ.100 కోట్ల పెట్టుబడితో.. మరో కొత్త పరిశ్రమ

## - 'నిమ్రానా స్టీల్స్'కు ఘనంగా ప్రారంభోత్సవం

ఏసీ, ఆటోమొబైల్ తయారీ రంగాలకు స్టీల్ ఉపకరణాలను ఉత్పత్తి చేసే టోక్యోకు చెందిన ప్రముఖ కంపెనీ నిప్పాన్ స్టీల్ ట్రేడింగ్ కార్పొరేషన్(ఎన్ఎస్‌టీసి) అనుబంధ సంస్థ నిమ్రానా స్టీల్ సర్వీస్ సెంటర్ ఇండియా (ఎన్ఎస్ఎస్ఐ) తన అత్యాధునిక నూతన పరిశ్రమను ఇటీవల శ్రీసిటీలో ప్రారంభించింది. ప్రారంభోత్సవ కార్యక్రమానికి చెన్నైలోని జపాన్ కాన్సుల్ జనరల్ మసయుకి టాగా ముఖ్యఅతిథిగా విచ్చేశారు. ఎన్ఎస్‌టీసి ప్రెసిడెంట్ షినిచి నకమురా, డైకిన్ వైస్ మేనేజింగ్ డైరెక్టర్ షోగో ఆండో, జపాన్ ఎక్స్‌టర్నల్ ట్రేడ్ ఆర్గనైజేషన్ (జెట్రో) డైరెక్టర్ జనరల్ కౌరు షిరైషి, శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి, ఎన్ఎస్ఎస్ఐ మేనేజింగ్ డైరెక్టర్ హిరోషి ఇటో తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా శ్రీసిటీలో అనేక జపనీస్ కంపెనీల స్థాపన పట్ల సంతోషాన్ని వ్యక్తం చేసిన మసయుకి టాగా, విదేశీ ప్రతినిధులకు ప్రత్యేకించి జపాన్ దేశీయులకు శ్రీసిటీ అత్యంత సురక్షిత ప్రాంతమని



చెప్పారు. జపాన్ పరిశ్రమలకు అద్భుత సహకారం అందిస్తున్న శ్రీసిటీ ఎం.డి డా. రవీంద్ర సన్నారెడ్డికి, రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డికి ఆయన ధన్యవాదాలు తెలిపారు. శ్రీసిటీలో పరిశ్రమ స్థాపించినందుకు ఎన్ఎస్ఎస్ఐ బృందానికి శ్రీసిటీ ఎం.డీ రవీంద్ర సన్నారెడ్డి అభినందనలు తెలియజేస్తూ, దీంతో పలు ప్రముఖ ఏసీ కంపెనీలతో 2026 నాటికి దేశంలో 50 శాతం కంటే ఎక్కువ ఏసీల ఉత్పత్తి శ్రీసిటీ నుండి ఉండగలదన్న ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. శ్రీసిటీలో 5 ఎకరాల విస్తీర్ణంలో దాదాపు రూ.100 కోట్ల పెట్టుబడితో, కేవలం తొమ్మిది నెలల వ్యవధిలో నిమ్రానా స్టీల్స్ ప్లాంట్ నిర్మాణం జరిగింది. ఈ కంపెనీ ఉత్పత్తి సామర్థ్యం ఏడాదికి 84 వేల మెట్రిక్ టన్నులుగా ఉంటుందని అంచనా. ఈ ప్లాంట్‌లో 200 మందికి పైగా ఉపాధి లభించనుంది కూడా.

# అమరజీవి త్యాగం.. విస్మరించలేనిది

## - మాజీ ఎమ్మెల్సీ విఠపు బాలసుబ్రహ్మణ్యం




ఆంధ్ర రాష్ట్ర సాధన కోసం, భాషాప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటు కోసం అమరజీవి శ్రీ పొట్టి శ్రీరాములు చేసిన ప్రాణత్యాగం ఏనాటికీ విస్మరించలేనిదని, ఆయన త్యాగనిరతి అపూర్వమని, ఆదర్శనీయమని మాజీ ఎమ్మెల్సీ విఠపు బాలసుబ్రహ్మణ్యం కొనియాడారు. ప్రముఖ రచయిత డా. నాగసూరి వేణుగోపాల్ రచించిన 'అమరజీవి శ్రీ పొట్టి శ్రీరాములు పోరాట జీవిత కథ' పుస్తకాన్ని ఈనెల 3న నెల్లూరులోని డికెడబ్ల్యు కాలేజీలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, శ్రీ పొట్టి శ్రీరాములు ఆమరణదీక్ష చేసి ప్రాణత్యాగం చేశారని, ఆయన త్యాగం దేశవ్యాప్తంగా భాషాప్రయుక్తరాష్ట్రాలకు బాటలు వేసిందని అన్నారు. అంతటి మహనీయుని జీవితగాథను నేటితరం వారు కూడా తెలుసుకుని, ఆ ఆశయాల స్ఫూర్తితో ఎదగాలని ఆయన ఆకాంక్షించారు. అందుకు ఈ పుస్తకం ఎంతగానో దోహదపడుతుందన్నారు. నెల్లూరులో శ్రీ పొట్టి శ్రీరాములు స్మారకస్థూపం ఏర్పాటుచేయాలని ఎంతోకాలం నుంచి ఆలోచనలున్నా నేటికీ ఆచరణలోకి రాకపోవడం బాధాకరమన్నారు. పుస్తక రచయిత డా.నాగసూరి వేణుగోపాల్, బీసీ సంక్షేమశాఖాధికారి వెంకటయ్య, డికెడబ్ల్యు కాలేజీ ప్రిన్సిపాల్ డా. డి.గిరి, జూనియర్ కాలేజీ ప్రిన్సిపాల్ డా.ఆదూరు శ్రీనివాసులు, ఇన్‌ఛార్జి ప్రిన్సిపాల్ రవీంద్రనాథ్, వయోజన విద్య విశ్రాంత డిప్యూటీ డైరెక్టర్ జి.మాల్యాద్రి, సాహితీవేత్తలు హెచ్ఎస్‌వికె రంగారావు, వేదం సూర్యప్రకాశం తదితరులు పాల్గొన్నారు.

# పార్టీ విజయానికి సమిష్టిగా కృషిచేయాలి

## ○ వైకాపా శ్రేణులకు నేతల దిశానిర్దేశం



ఎన్నికలు సమీపిస్తున్న ప్రస్తుత తరుణంలో క్షేత్రస్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేసుకుంటూ, ఎన్నికల్లో ఘన విజయం సాధించేందుకు సమిష్టిగా కృషి చేయాలంటూ వైకాపా నాయకులు ఆయా ప్రాంతాల నాయకులు, కార్యకర్తలతో సమావేశాలు ఏర్పాటుచేస్తూ పార్టీశ్రేణులకు మార్గదర్శనం చేస్తున్నారు. తిరుపతిలో ఇటీవల పెద్దఎత్తున కార్యకర్తలు, నాయకులతో జరిగిన ఈ సమావేశాల్లో వైకాపా జాతీయ ప్రధాన కార్యదర్శి, రీజనల్ కో-ఆర్డినేటర్ విజయసాయిరెడ్డి, తిరుపతి జిల్లా వైకాపా అధ్యక్షులు..రాష్ట్ర కమ్యూనిటీ డెవలప్‌మెంట్ బోర్డు ఛైర్మన్ నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి, తిరుపతి ఎంపీ గురు మూర్తి, సూళ్ళూరుపేట శాసనసభ్యుడు కిలివేటి సంజీవయ్య తదితరులు పాల్గొని పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. తిరుపతి జిల్లాలో నియోజకవర్గాల వారీగా పార్టీ సమీక్షా సమావేశాలను ఏర్పాటు చేశారు. సూళ్ళూరుపేట నియోజకవర్గం నాయకులతో సమావేశమై తగు సూచనలిచ్చారు. ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ, ప్రజల సమస్యలు ఎప్పటికప్పుడు పరిష్కరించాలని, ప్రభుత్వ సంక్షేమపథకాలను, రాష్ట్రాభివృద్ధికి చేపట్టిన కార్యక్రమాలను ఎప్పటికప్పుడు ప్రజలకు వివరించాలని, ప్రభుత్వ పథకాలు అర్హులందరికీ అందుబాటులో ఉండేలా చూడాలని నాయకులకు, కార్యకర్తలకు సూచించారు.

# మద్దతు ధర అమలుకు చట్టం చేయాలి

రైతులు పండించిన పంటలకు మద్దతుధర అమలుచేసేందుకు చట్టం చేయాలని, రైతు సమస్యల పరిష్కారానికి కేంద్రం ఇచ్చిన హామీలను నెరవేర్చాలని కిసాన్ సంయుక్త మోర్చా, జిల్లా కార్మిక సంఘాల ఐక్యవేదిక నాయకులు, రైతుసంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఈనెల 3న నెల్లూరు కలెక్టరేట్ వద్ద జిల్లా కార్మికసంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో నాయకులు ధర్నాందోళన నిర్వహించి అనంతరం జాయింట్ కలెక్టర్‌కు విజ్ఞాపన పత్రం సమర్పించారు. ఈ ఆందోళనలో నాయకులు చంద్ర రాజగోపాల్, చిరసాని కోటిరెడ్డి, షానవాజ్, జీ. రమణయ్య, వెంకమరాజు, ప్రసాద్ పాల్గొన్నారు.

## తిరుపతి జిల్లా గూడూరు డివిజన్

# రైల్వేస్టేషన్‌లో 'స్వచ్ఛతా హి సేవ'




ప్రధాని నరేంద్ర మోడీ పిలుపుమేరకు దేశవ్యాప్తంగా జరుగుతున్న 'స్వచ్ఛతా హి సేవ' కార్యక్రమంలో భాగంగా ఇటీవల గూడూరు రైల్వేస్టేషన్ పరిసరాలను పలువురు నాయకులు, అధికారులు పరిశుభ్రం చేశారు. స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఛైర్‌పర్సన్ పొణకా దేవసేనమ్మ చీపురు పట్టి పరిసరాలను శుభ్రం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజలందరూ 'స్వచ్ఛతా హి సేవ'లో పాల్గొని పరిసరాల పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని పిలుపునిచ్చారు. విజయవాడ డివిజన్ డిఆర్ యుసిసి మెంబర్ మయూరి శ్యామ్‌యాదవ్, స్టేషన్ మేనేజర్ పి.వెంకటేశ్వరరావు, చీఫ్ కమర్షియల్ సూపర్‌వైజర్ ఆర్టీ వెంకటేశ్వర్లు, డిఎంఐ ఎస్ఎస్ కుమార్, ఎస్ఎస్ఈ షేక్ రెహమాన్, టి.సురేష్, ఆర్పీఎఫ్ సిఐ లక్ష్మీనారాయణ, శానిటరీ సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రైవేట్ బ్యాంకులకు ధీటుగా ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంక్




ప్రైవేట్ బ్యాంకులకు ధీటుగా ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంకు పనిచేస్తోందని, ఖాతాదారులు తమ సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఆ బ్యాంకు ఛైర్మెన్ రాకేష్ కశ్యప్ కోరారు. గూడూరు పట్టణంలోని డీఎన్ఆర్ కమ్యూనిటీ హాలులో ఈ నెల 4వ తేదీ నిర్వహించిన రుణ విస్తరణ కార్యక్రమం - 2023 (క్రెడిట్ ఔట్ రీచ్) ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంకులలో డిజిటల్ సేవలు, సామాజిక భద్రతా పథకాలు అందుబాటులో ఉన్నాయన్నారు. అనంతరం ఛైర్మెన్ రాకేష్ కశ్యప్, ఆర్ఎం మోహన్‌రెడ్డిల చేతులమీదుగా లబ్దిదారులకు 7కోట్లా 23లక్షల రూపాయల నగదు చెక్కును అందించారు. బ్యాంకు రీజనల్ మేనేజర్ మోహన్‌రెడ్డి, లీడ్ మేనేజరు సుభాష్, చీఫ్ మేనేజర్ ఆంజనేయులు, గూడూరు మెయిన్ బ్రాంచ్ మేనేజర్ ఎం.వెంకటేశ్వర్‌రావు, తిరుపతి, నెల్లూరు జిల్లాల ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకుల మేనేజర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

# మాజీమంత్రి బల్లి దుర్గాప్రసాద్ జయంతి



ఈ నెల 3వ తేదీ దివంగత మాజీమంత్రి బల్లి దుర్గాప్రసాదరావు జయంతిని పురస్కరించుకుని వైసీపీ నాయకుడు మోగిరాజు శ్రీనివాసులురాజు ఆధ్వర్యంలో టవర్‌క్లాక్ సెంటర్ వద్ద భారీ కేక్ కట్‌చేసి అభిమానులకు, నాయకులకు పంచిపెట్టారు. ముఖ్యఅతిథిగా కోట సునీల్‌కుమార్ హాజరై కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు బాబురెడ్డి, వాకాటి ప్రభాకర్, పేటేటి చంద్రనీల్, దాసరి వెంకటేశ్వర్లు, గారా వంశీ, ఆకాష్, ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

# పేకాట స్థావరంపై మెరుపు దాడులు



గూడూరు రూరల్, కుందకూరులోని కొండ కింద గుట్టు చప్పుడు కాకుండా పేకాట ఆడుతున్నారనే సమాచారం మేరకు గూడూరు రూరల్ ఎస్సై బ్రహ్మనాయుడు తమ సిబ్బందితో కలిసి పేకాట స్థావరాలపై ఈ నెల 2వ తేదీ మెరుపు దాడి చేశారు. పేకాట ఆడుతున్న నలుగురు పేకాటరాయుళ్లను అదుపులోకి తీసుకొని వారి వద్ద నుండి రూ.51 వేల రూపాయల నగదును పట్టుకున్నారు. ఈ సందర్భంగా ఎస్సై బ్రహ్మనాయుడు మాట్లాడుతూ జూదం ఆడినా, ప్రోత్సహించినా, వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. జూదం ఆడడం వల్ల అనేక కుటుంబాలు ఆర్థికంగా నష్టపోతున్నారన్నారు. ఎక్కడైనా జూదం ఆడినట్లు గుర్తిస్తే తమకు సమాచారం అందజేయాలని కోరారు. వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని చెప్పారు.




# లయన్స్ క్లబ్ సేవా కార్యక్రమాలు

గాంధీ జయంతి, లాల్ బహదూర్ శాస్త్రిల జయంతిలను పురస్కరించుకుని ఈ నెల 2న లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో క్లబ్ అధ్యక్షులు ఆర్.రవిచంద్ర ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్ర మాలు నిర్వహించారు. తొలుత గాంధీజీ, లాల్ బహదూర్‌శాస్త్రిల చిత్రపటాల వద్ద నివాళులర్పించి, ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు, బ్రెడ్, ఓఆర్ఎస్ ద్రావణం అందించారు. సరస్వతి శిశు మందిరం పరిసరాల్లో చెట్లు నాటారు. లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో కుట్టు నేర్చుకున్న ఇద్దరు మహిళలకు వారి జీవనోపాధికై రెండు కుట్టుమిషన్లు, 50 మంది పేదలకు చీరలు, పంచలు అందించారు. అనంతరం, అన్నదాన కార్యక్రమం చేపట్టారు. లయన్స్ క్లబ్ డిస్ట్రిక్ట్ ఛైర్మెన్ షేక్ రియాజ్ అహ్మద్, క్లబ్ సెక్రటరీ కే. శివయ్య, ట్రెజరర్ వీరేంద్రనాథ్, సభ్యులు సోమిశెట్టి చెంచు రామయ్య, మల్లెమాల మురళిరెడ్డి, షేక్ మస్తాన్, రూపేష్‌రెడ్డి, జగదీశ్‌చంద్ర, మదనమేటి రమణయ్య, అక్కన రమణయ్య, డాక్టర్ చంద్రహాస్ పాల్గొన్నారు.

# స్వీపర్లకు ఇన్నర్‌వీల్ చీరలు, దుప్పట్లు



గాంధీ జయంతిని పురస్కరించుకుని అక్టోబర్ 2వ తేదీ ఇన్నర్‌వీల్ క్లబ్, ఆంధ్ర మహిళా మండలి ఆధ్వర్యంలో గూడూరు ఏరియా ఆసుపత్రిలోని స్వీపర్లకు గౌరవాధ్యక్షురాలు డాక్టర్ సి. రోహిణి, ఇన్నర్‌వీల్ అధ్యక్షురాలు విష్ణువందనల చేతుల మీదుగా చీరలు, దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో స్నేహలతారెడ్డి, శశికళ, శశిరేఖ, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



# ఆర్టీసీ ఉద్యోగుల కష్టాలు తీర్చాలి

ఆర్టీసీ ఉద్యోగుల కష్టాలు తీర్చాలంటూ ఈనెల 3న నెల్లూరులోని ఆర్టీసీ ప్రధాన బస్టాండు వద్ద ఎస్‌డబ్ల్యుఎఫ్ ఆధ్వర్యంలో నాయకులు, ఆర్టీసీ కార్మికులు ఆందోళన చేపట్టారు. ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసినతర్వాత కష్టాలు పోతాయనుకుంటే, కొత్త కష్టాలు వచ్చిపడ్డాయని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఆర్టీసీ యాజమాన్యం డిపో మేనేజర్లకు అపరిమితమైన అధికారాలు కట్టబెడుతూ, ఉద్యోగులను అణిచివేతకు గురిచేస్తోందని ఎస్‌డబ్ల్యుఎఫ్ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు షేక్ జిలానీబాషా విమర్శించారు. కెఎంపిఎల్ పేరుతో డ్రైవర్లను వేధించడం దారుణమన్నారు. తమ సమస్యలను ఆర్టీసీ యాజమాన్యం వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ ఆందోళనలో ఆ సంఘం రాష్ట్ర నాయకులు కట్టా సుబ్రహ్మణ్యం, టి.దశరథ, జిల్లా మహిళా కన్వీనర్ డి.రాజమ్మ తదితరులు పాల్గొన్నారు.

# మద్యపాన నిషేధం ఏదీ?..

## జగన్ హామీలన్నీ ఉత్తుత్తివే

**- బీజేపీ నాయకుల విమర్శ**



అధికారంలోకి వచ్చిన వెంటనే మద్యపానాన్ని నిషేధిస్తామని చెప్పిన వైకాపా అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ముఖ్యమంత్రి పదవి చేపట్టాక మాట తప్పారని, జగన్ హామీలన్నీ ఉత్తుత్తివేనని బీజేపీ జిల్లా అధ్యక్షుడు శిపారెడ్డి వంశీధర్‌రెడ్డి విమర్శించారు. అక్టోబరు 2న గాంధీజయంతి సందర్భంగా బీజేపీ నాయకులు మద్యపాన నిషేధాన్ని కోరుతూ నెల్లూరులోని గాంధీ విగ్రహంవద్ద ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను జగన్ ఏ ఒక్కటీ నెరవేర్చడం లేదన్నారు. దశలవారీగా మద్యాన్ని నిషేధిస్తామని చెప్పి, నాలుగేళ్ళు గడుస్తున్నా పట్టించుకోకపోవడం దారుణమన్నారు. నాయకులు సన్నపురెడ్డి సురేష్‌రెడ్డి, కర్నాటి ఆంజనేయరెడ్డి, పి.సురేంద్రరెడ్డి, మిడతల రమేష్, యశ్వంత్‌సింగ్, పొట్లూరి శ్రీనివాసులు, కోసూరు బాలయ్య గౌడ్, బి.శ్రీనివాసులు, రాజేష్, విజయకుమార్, రాధాకృష్ణ, గిరికుమార్‌గౌడ్ పాల్గొన్నారు.

# ఈత సరదా..ప్రాణం తీసింది

## సిద్ధేశ్వరకోన జలపాతంలో బీటెక్ విద్యార్థి దుర్మరణం



ఈత సరదా బీటెక్ విద్యార్థి దుర్మరణానికి దారితీసింది. రాపూరు ఎస్ఐ మాల్యాద్రి కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. తమిళనాడులోని పాండిచ్చేరి కాలేజీలో బీటెక్ చదువుతున్న 14 మంది విద్యార్థులు కాలేజీకి సెలవులు కావడంతో ఈనెల 1న రాపూరు ఘాట్‌రోడ్డులో ఉన్న సిద్ధేశ్వరకోనలో జలపాతంలో ఈత కొట్టాలనే ఉత్సాహంతో వచ్చారు. అందులో ఒక యువకుడు ముందుగా జలపాతంలోకి దిగాడు, కానీ ఇక బయటకు రాలేకపోయాడు. మిగిలిన విద్యార్థులు భయపడి రాపూరు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు వెంటనే అక్కడికి చేరుకుని గాలింపు చర్యలు చేపట్టారు. కానీ, అదంతా అటవీప్రాంతం కావడం, అప్పటికే చీకటిపడడంతో గల్లంతైన విద్యార్థి ఆచూకీ దొరకలేదు. మళ్ళీ సోమవారం గజ ఈతగాళ్లతో గాలింపు చేపట్టగా జలపాతం అడుగున సుమారు 70 అడుగుల లోతులో మృతదేహం లభించిందని, ఆ విద్యార్థి నెల్లూరుజిల్లా అల్లూరు మండలం ఇసుకపల్లి గ్రామానికి చెందిన మనోజ్ కుమార్‌గా గుర్తించామని చెప్పారు. మృతదేహానికి పంచనామా చేసి, కుటుంబసభ్యులకు అందజేశామని తెలిపారు.

# శ్రీసిటీ పారిశ్రామిక ప్రగతి భేష్..







శ్రీసిటీ పారిశ్రామిక ప్రగతి భేష్ అని రాష్ట్ర పరిశ్రమల శాఖ కార్యదర్శి డా.ఎన్ యువరాజ్ ప్రశంసించారు. ఇటీవల ఆయన శ్రీసిటీలోని పరిశ్రమల యాజమాన్యాలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి వారికి స్వాగతం పలికి, శ్రీసిటీ అభివృద్ధి స్థితిగతులను వివరించారు. పెట్టుబడిదారుల అనుకూల వాతావరణ సృష్టి అనేది సమర్థవంతమైన పారిశ్రామిక విధానమని, దాని పటిష్టవంతమైన అమలు, నిరంతర కృషిపై ఆధారపడి ఉంటుందని ఆయన అన్నారు. పెట్టుబడిదారులకు ఈ విధానాన్ని అందుబాటులో ఉంచడానికి, ఆంధ్రప్రదేశ్ పరిశ్రమల శాఖ సమర్థ నాయకత్వంలో, తరచూ వ్యాపారవేత్తలతో చర్చలు నిర్వహించడంతో పాటు అవసరమైన సవరణలను చేపడుతున్నట్లు తెలిపారు. శ్రీసిటీ ప్రారంభ దశల్లో డా. యువరాజ్ అందించిన ప్రోత్సాహాన్ని ఆయన గుర్తుచేశారు. శ్రీసిటీలో వేగవంతమైన అభివృద్ధి అద్భుతమని డా. యువరాజ్ ఈ సందర్భంగా సంతృప్తి వ్యక్తం చేశారు. పారిశ్రామిక ప్రగతిని ఆకాంక్షిస్తూ, పరిశ్రమల ప్రతినిధులతో ఆయన పలు అంశాలపై చర్చించారు. తిరుపతి జిల్లా పరిశ్రమల కేంద్రం జాయింట్ డైరెక్టర్ ఇ.ప్రతాపరెడ్డి, ఏపిఐఐసి జోనల్ మేనేజర్ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# మార్మోగిన హరినామ సంకీర్తన



పెరటాసి మాసం రెండవ శనివారం రోజున శ్రీసిటీలోని శ్రీ ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణం హరినామ సంకీర్తనలతో మార్మోగింది. శ్రీసిటీ పరిసరాల్లోని ఇరుగుళం గ్రామానికి చెందిన భజన బృంద కళాకారులు పాల్గొని ఈ కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. శ్రీ పసన్న వేంకటేశ్వరస్వామి పూజానంతరం, శ్రీసిటీ ఆధ్యాత్మిక, సాహిత్య వేదిక శ్రీవాణి ఆధ్వర్యంలో జరిగిన భజన కార్యక్రమంలో, ఇరుగుళం గ్రామానికి చెందిన శ్రీ తిరువెంకట రామానుజ భక్త సమాజం కళాకారుల బృందం మధురంగా ఆలపించిన హరి సంకీర్తనలు భక్తులను ఆకట్టుకున్నాయి. భజన బృందం గురువు గుణశేఖర్ మాట్లాడుతూ నవవిధ భక్తి మార్గాలలో దైవనామ సంకీర్తనలు, భజనలు భగవంతునికి మిక్కిలి ప్రీతికరమని చెబుతూ, నిత్యం హరినామస్మరణ చేయాలని అందరినీ కోరారు. శ్రీసిటీ పరిసరాల ప్రజలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం నిర్వాహకులు భక్తులందరికీ స్వామివారి తీర్థ ప్రసాదాలు, అన్నప్రసాదాలు అందజేశారు.

# వీఎస్‌యులో గాంధీ జయంతి



నెల్లూరులోని విక్రమ సింహపురి విశ్వవిద్యాలయంలో అక్టోబరు 2న మహాత్మా గాంధీ 154వ జయంతిని ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా వివిఎస్‌యు కళాశాల ప్రిన్సిపల్ ఆచార్య విజయ ఆనంద్ కుమార్‌బాబు పాల్గొని మహాత్మా గాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. విఎస్‌యు డీన్ డాక్టర్ సిహెచ్ విజయ, ఎన్ఎస్ఎస్ సమన్వయకర్త డాక్టర్ ఉదయశంకర్, అసిస్టెంట్ రిజిస్ట్రార్ డాక్టర్ జి.సుజయ్‌కుమార్, రామకృష్ణ సుబ్బారావుతో పాటు ఎన్ఎస్ఎస్ వలంటీర్లు పాల్గొన్నారు.

# రెవెన్యూ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షునిగా అల్లంపాటి పెంచలరెడ్డి



జిల్లా ఏపీ ఆర్ఎస్ఏ జిల్లా అధ్యక్షులు, ఏపీ జేఏసీ-అమరావతి జిల్లా ఛైర్మెన్ అల్లంపాటి పెంచలరెడ్డి ఆంధ్రప్రదేశ్ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ (ఏపీ ఆర్ఎస్ఏ) రాష్ట్ర ఉపాధ్యక్షునిగా ఎన్నికయ్యారు. ఇటీవల విజయవాడలో జరిగిన ఆ సంఘం రాష్ట్ర కార్యవర్గ ఎన్నికల్లో అల్లంపాటిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా రెవెన్యూ ఉద్యోగుల, అధికారులు, జిల్లా సంఘం నాయకులు ఆయన్ను అభినందించారు.

# టూకీగా...



## పెంచలకోనలో వేడుకగా నృసింహుని కల్యాణం

జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన పెంచలకోనలో వెలసి వున్న శ్రీ పెనుశిల లక్ష్మీనరసింహస్వామి కల్యాణోత్సవం ఇటీవల వేడుకగా జరిగింది. తొలుత స్వామివారి ఆస్థాన మండపంలో స్వామివారికి-అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేసి, అనంతరం శాస్త్రోక్తంగా కల్యాణోత్సవం నిర్వహించారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. ఆలయ ఇఓ జనార్దన్‌రెడ్డి పర్యవేక్షించారు.

## కోవూరులో సీనియర్ సిటిజన్లకు సన్మానాలు

ప్రపంచ వృద్ధుల దినోత్సవం సందర్భంగా ఈనెల 1న కోవూరు గ్రామ సచివాలయంలో 80 ఏళ్ళు దాటిన పలువురు వృద్ధులను అభినందిస్తూ ఘనంగా సన్మానించారు. తహశీల్దార్ పద్మజ, రెవెన్యూ ఇన్స్‌పెక్టర్ రమణయ్య, సీనియర్ అసిస్టెంట్ కిరణ్, సుధ తదితరుల ఆధ్వర్యంలో ఈ సన్మానాలు జరిగాయి.

## ముసునూరువారిపాలెంలో అంకమ్మతల్లి పునఃప్రతిష్ట

ముత్తుకూరు మండలం ముసునూరువారిపాలెంలో ఈనెల 1న గ్రామదేవత అంకమ్మ తల్లి ఆలయంలో అమ్మవారి పునః ప్రతిష్ట వైభవంగా జరిగింది. మూడురోజుల పాటు గ్రామస్తులు విశేషపూజలు చేసి, అమ్మవారిని పునః ప్రతిష్ఠించారు. మేళతాళాలు, మంగళవాద్యాలు, తప్పెట్ల మోతల మధ్య జరిగిన ఈ కార్యక్రమంలో పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

## అన్నారెడ్డిపాలెంలో ఆరోగ్య సురక్ష

సంగం మండలంలోని అన్నారెడ్డిపాలెంలో ఇటీవల జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరాన్ని అధికారులు నిర్వహించారు. రోగులకు ఆరోగ్యపరీక్షలు నిర్వహించి సూచనలిచ్చారు. జాయింట్ కలెక్టర్ కూర్మనాథ్ పరిశీలించారు. తహశీల్దారు నాగరాజు, ఆప్తమాలజిస్టు శ్రీలేఖ, వైద్యులు యూసఫ్, శ్రీవేణి, శ్రీనివాసులురెడ్డి, వైకాపా నాయకులు రఘునాథరెడ్డి పాల్గొన్నారు.

## సోమరాజుపల్లిలో ఆక్వా రైతులకు శిక్షణ

ఇందుకూరుపేట మండలంలోని సోమరాజుపల్లి గ్రామంలో ఇటీవల ఎంపెడా డెప్యూటీ డైరెక్టర్ శివరాజన్ ఆధ్వర్యంలో ఆక్వా రైతులకు శిక్షణ కార్యక్రమం జరిగింది. తక్కువ సమయంలో ఎక్కువ దిగుబడులు సాధించేందుకు తీసుకోవాల్సిన విధానాలను ఆయన రైతులకు వివరించారు. టెక్నికల్ అధికారులు డాక్టర్ కె.అయ్యప్పన్, అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

## కావలి సబ్‌జైలులో ఖైదీల సంక్షేమ దినోత్సవం

కావలి సబ్‌జైలులో ఈనెల 2న ఖైదీల సంక్షేమ దినోత్సవం ఘనంగా జరిగింది. గాంధీజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. జైలు సూపరింటెండెంట్ కె.చిన్న సుబ్బయ్య, డా.రామ్‌సెంటర్ ఛైర్మెన్ దొడ్ల మనోహర్‌రెడ్డి, డైరెక్టర్ తాతిరెడ్డి, లోక్ అదాలత్ సభ్యులు మాలకొండారెడ్డి పాల్గొని, ఖైదీలు పరివర్తనచెంది నేరప్రవృత్తికి దూరంగా ఉండాలని సూచించారు.

## బద్దెవోలు విద్యార్థుల క్రీడాప్రతిభ

మనుబోలు మండలం బద్దెవోలు హైస్కూల్‌లో 9వ తరగతి చదువుతున్న పి.వెంకట స్నేహలత, 10వ తరగతి విద్యార్థిని ఎం. భావ్య హ్యాండ్‌బాల్ పోటీల్లోనూ, 10వ తరగతి విద్యార్థి సాదిక్‌బాషా యోగాలోనూ సత్తాచాటి రాష్ట్రస్థాయిలో జరగనున్న పోటీలకు ఎంపికయ్యారు. వారిని ఆ స్కూల్ ప్రధానోపాధ్యాయురాలు చందన, పీఈటీ మధుసూదన్‌లు అభినందించారు.

## స్వర్ణాజీపురంలో పేకాటరాయుళ్ళ అరెస్ట్

గుడ్లూరు మండలంలోని స్వర్ణాజీపురం వద్దనున్న మామిడి తోపుల్లో పేకాటాడుతున్న అయిదుగురిని పోలీసులు పట్టుకుని వారినుంచి 70,500 రూపాయలు స్వాధీనం చేసుకున్నారు. గుడ్లూరు సిఐ పి.సుబ్బారావు, ఎస్ఐ ప్రసాద్‌రెడ్డి, పోలీసుల బృందం వీరిని అదుపులోకి తీసుకుంది.

## మాలకొండకు 9.71 లక్షల ఆదాయం

కందుకూరు నియోజకవర్గం వలేటివారిపాలెం మండలంలోని మాలకొండలో వెలసివున్న శ్రీ మాల్యాద్రి లక్ష్మీనరసింహస్వామివారికి గత శనివారం ఒక్కరోజులోనే భక్తులు సమర్పించిన కానుకల ద్వారా 9.71, 707 రూపాయలు వచ్చినట్లు ఆలయ సహాయ కమిషనర్ కెబి శ్రీనివాసరావు తెలిపారు.

# దిద్దుబాటు - సర్దుబాటు

(మొదటి పేజీ తరువాయి)

చేరవేశారని విశ్వసనీయ సమాచారం. త్వరలో ఎన్నికల కాలం రాబోతోంది, కనీసం ఇలాంటి తరుణంలోనైనా మేల్కోకపోతే ఇబ్బంది పడతామని ఆ సర్వే బృందాలు తేల్చి చెప్పేశాయని తాడేపల్లి వార్త. 'మనం పథకాల పేరుతో బటన్ నొక్కి ఓటర్ల ఖాతాలో డబ్బు వేశాం... కానీ, రేపు ఆ ఓటర్లు బటన్ నొక్కి, మనకు ఓట్లు వేయించే బూత్ స్థాయి నాయకులను దూరం చేసుకున్నాం' అని వారు తెగేసి చెప్పారని వార్త.

చంద్రబాబు అరెస్టుతో పార్టీ కార్యకర్తలలో ఉత్సాహం వచ్చింది. క్యాడర్ అంతా సంతోషపడుతోంది, ఒక్కసారిగా అందరినీ మళ్ళీ మనవైపుకు తిప్పుకోవాలంటే ఇదే మంచి సమయం అని కూడా వారు సలహా ఇచ్చారంటున్నారు. ఇదే స్పీడుతో రాష్ట్రంలో కొంతైనా అభివృద్ధి కార్యక్రమాలకి శ్రీకారం చుట్టడం, పార్టీపై అసంతృప్తితో ఉన్న వారిని బుజ్జగించి మళ్లీ పార్టీ వైపుకు తిప్పుకోవడం వంటి అంశాలతో పాటు ఇంకా చాలా విషయాలను సదరు సర్వే బృందం పార్టీ పెద్దలకి క్షుణ్ణంగా వివరించిందని రాజకీయ వర్గాల భోగట్టా.

## అభివృద్ధిపై ఫోకస్...

ప్రభుత్వం కూడా ఇప్పుడు అభివృద్ధి కార్యక్రమాలపై ఫోకస్ పెట్టబోతోందని అటు అధికార వర్గాలు, ఇటు పార్టీ శ్రేణులు చెప్తున్నారు. యుద్ధ ప్రాతిపదికన రాష్ట్రంలోని అన్ని ప్రధాన రహదారులతో పాటు గ్రామీణ ప్రాంత రోడ్లను కూడా పూర్తిచేసే దిశగా అడుగులు పడుతున్నాయని అంటున్నారు. అలాగే, పెండింగులో ఉన్న కాంట్రాక్టర్ల బిల్లులన్నీ చెల్లించేస్తారని, గ్రామాల్లో చిన్నచిన్న ఇరిగేషన్ పనులు చేసి బిల్లుల కోసం తపస్సు చేస్తున్న వారి కల నెరవేరేలా వాళ్ళ బిల్లులు కూడా చెల్లించేలా ప్రభుత్వం యోచన చేస్తోందని పార్టీ వర్గాలు చెప్పుకుంటున్నాయి. అంతే కాకుండా పారిశ్రామిక అభివృద్ధికి జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం పకడ్బందీ ప్రణాళికలను రూపొందించి, వీలయినన్ని ఎక్కువ పరిశ్రమలని రానున్న ఆరు నెలల కాలంలో ప్రారంభింపచేయించి, వేలాదిమంది నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కూడా కల్పించబోతోందని అధికారులు హామీ ఇస్తున్నారు. అందులో భాగంగానే అక్టోబర్ 4వ తేదీ బుధవారం నాడు ముఖ్యమంత్రి జగన్ జూమ్ ద్వారా రాష్ట్రంలో 3 పరిశ్రమలకి ప్రారంభోత్సవాలు, 9 పరిశ్రమలకి శంకుస్థాపనలు, ఒక పరిశ్రమకి ఎంఓయు చేశారని అంటున్నారు. అనంతరం ఆయనే స్వయంగా లైవ్ ద్వారా మీడియాతో మాట్లాడడం రాబోయే కాలంలో ఆయన చేయబోయే అనేక అభివృద్ధి కార్యక్రమాలకి సూచిక అని కూడా పార్టీ శ్రేణులు అభిప్రాయపడుతున్నారు.

## పార్టీపై దృష్టి...

ప్రభుత్వపరంగా అభివృద్ధి కార్యక్రమాలపై ఫోకస్ పెడుతూనే పార్టీ పటిష్టత కోసం అవసరమైన చర్యలు తీసుకోవలసిందిగా జగన్ ఆ నలుగురినీ ఆదేశించారని తాడేపల్లి వార్త. పార్టీపైన అసంతృప్తితో ఉన్నవారిని గుర్తించి, వారిని బుజ్జగించే పనిలో పార్టీ పెద్దలు నిమగ్నమయ్యారు. ఇటీవల రాజ్యసభ సభ్యులు విజయసాయిరెడ్డి తిరుపతి జిల్లాలో మూడు రోజుల పాటు మకాం వేసి బుజ్జగింపుల పనిలో ఉన్నారు. పనిలోపనిగా రాబోయే ఎన్నికలలో తిరుపతి శాసనసభ నుండి టీటీడీ ఛైర్మెన్, ప్రస్తుత తిరుపతి ఎంఎల్ఏ భూమన కరుణాకరరెడ్డి తనయుడు భూమన అభినయ్‌రెడ్డి పోటీ చేస్తారని, చంద్రగిరి అభ్యర్థిగా ప్రస్తుత శాసనసభ్యులు చెవిరెడ్డి భాస్కరరెడ్డి కుమారుడు చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి బరిలో ఉంటారని ప్రకటించేశారు.

అక్టోబర్ 4, 5, 6 తేదీలలో ఇలాంటి తతంగమే నెల్లూరుజిల్లాలో కూడా జరగాల్సి ఉండగా, ముఖ్యమంత్రి ఢిల్లీ పర్యటన ఖరారు కావడంతో వాయిదా పడింది. 2019లో పార్టీ అధికారంలోకి వచ్చిన నాటి నుండి ప్రత్యేక విమానంలో ఢిల్లీ, విశాఖపట్టణం, తాడేపల్లిలలో పర్యటించడం తప్ప జిల్లాల ముఖం కూడా చూడని విజయసాయి, ఇప్పుడు జిల్లాల సాయి చూడడం విడ్డురంగా ఉందని, "అయినా ఎలచ్చన్లు వస్తున్నాయిగా" అంటూ పార్టీ శ్రేణులే చర్చించుకుంటున్నారు. ఇదే క్రమంలో రాష్ట్రంలోని ప్రతి జిల్లాలో పార్టీ పెద్దలు సమావేశాలు నిర్వహించి, అలిగి అటకెక్కిన వారిని కిందకు దించడంతో పాటు, పార్టీ వదిలి వెళ్లిపోయిన వారిని మళ్ళీ వెనక్కు పిలిపించే ప్రయత్నాలు ముమ్మరం చేయనున్నట్లు పార్టీ శ్రేణులు చెప్తున్నారు.

జగన్‌మోహన్‌రెడ్డి కోసం పనిచేసి, ఆయన గెలిచాక కనీసం నేరుగా ఆయన ముఖం చూడడానికి కూడా నోచుకోని వై.ఎస్. కుటుంబ అభిమానులను కూడా జగన్‌తో కలిపించే ప్రయత్నం చేస్తామని తాడేపల్లి వర్గాలు చెప్తున్నట్లు వైసీపీ నేతలు అంటున్నారు. ఆపరేషన్ ఎలక్షన్ పేరుతో లోపాలకు కరెక్షన్ చేసి, అటు ప్రభుత్వంలో లోపాలను దిద్దుబాటు చేయడంతో పాటు, పార్టీలో అసంతృప్తివాదులను సర్దుబాటు చేసే పనిలో అటు అధికారులు, ఇటు పార్టీ పెద్దలు నిమగ్నమయ్యారని రాజకీయ వర్గాల సమాచారం. మొత్తంమీద దిద్దుబాట్లు, సర్దుబాట్లతో రాష్ట్రంలో వైసీపీ మరోసారి విజయఢంకా మ్రోగించడానికి సన్నద్ధమవుతోందని మాత్రం స్పష్టమవుతోంది!






# చంద్రబాబుకు అండగా మేముంటామన్న తెలుగు తమ్ముళ్ళు

- అరెస్ట్ అక్రమమంటూ వెల్లువెత్తిన నిరసనలు
- నెల్లూరులో గళమెత్తి గర్జించిన టీడీపీ నాయకులు



తెలుగుదేశం పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అరెస్టను నిరసిస్తూ నెల్లూరులోని టీడీపీ నాయకులు, ఆయనకు మద్దతుగా నిలిచిన పార్టీల నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో ఈనెల 4న ర్యాలీ నిర్వహించారు. నెల్లూరు, వీఆర్‌సి కూడలిలోని డా.బిఆర్ అంబేద్కర్ విగ్రహం వద్ద నుంచి ట్రంకురోడ్డులోని గాంధీబొమ్మ విగ్రహం వరకు శాంతియుత ప్రదర్శన చేపట్టారు. జిల్లావ్యాప్తంగా అన్ని నియోజకవర్గాల నుంచి కార్యకర్తలు, నాయకులు ఈ ఆందోళనలో పాల్గొని వైకాపా పాలనకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. తెలుగుదేశం పార్టీ నాయకులు, మాజీమంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, మరో మాజీమంత్రి ఆనం రామనారాయణరెడ్డి, టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బీద రవిచంద్ర, రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోటంరెడ్డి శ్రీనివాసులు రెడ్డి తదితరులంతా వ్యూహాత్మకంగా ర్యాలీకి చేరుకుని ఆందోళనలో పాల్గొన్నారు. జిల్లా టీడీపీ, జనసేన, సీపిఐ, ప్రజా సంఘాల నాయకులు తరలివచ్చి వైకాపా ప్రభుత్వ విధానాలను నిరసిస్తూ గళమెత్తారు. మేము సైతం బాబుకు తోడుంటాం అంటూ కార్యకర్తలు ప్రతినబూనారు. గాంధీ విగ్రహం వద్దకు అందరూ చేరుకుని 'బాపుకు చెపుతాం' అంటూ వైకాపా తీరును నాయకులు ఎండగట్టారు. చంద్రబాబునాయుడిని కక్ష సాధింపు చర్యల్లో భాగంగా అక్రమ కేసులు బనాయించి జైల్లో పెట్టారని, ఆయన బయటకు వచ్చేవరకు అలుపెరగకుండా పోరాటం చేస్తామని స్పష్టం చేశారు. దుర్మార్గపు పాలన చేస్తున్న జగన్‌ను గద్దె దింపే రోజు త్వరలోనే వస్తుందని, రానున్న ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ గెలుపును ఎవరూ అడ్డుకోలేరని సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి అన్నారు. టీడీపీ-జనసేన కలవడంతో వైకాపా నాయకులనకు వెన్నులో వణుకుపుడుతోందన్నారు. అభివృద్ధి సాధకుడైన చంద్రబాబుపై ఆధారాలు లేని కేసులు పెట్టినంతమాత్రాన ఆయన్నెవరూ ఆపలేరని, న్యాయపోరాటం ద్వారా ఆయన తిరిగి బయటకు వస్తారని ఆనం రామనారాయణరెడ్డి ధీమా వ్యక్తం చేశారు. ఈ ఆందోళనలో టీడీపీ నాయకులు పాశం సునీల్, పరసా రత్నం, కురుగొండ్ల రామకృష్ణ, కంభం విజయరామిరెడ్డి, నెలవల సుబ్రహ్మణ్యం, చెంచలబాబు యాదవ్, ధర్మవరపు సుబ్బారావు, దొడ్డవరపు రాజనాయుడు, ఆలూరు వెంకటేశ్వర్లు చౌదరి, కువ్వారపు బాలాజీ, కప్పిర శ్రీనివాసులు, జెన్ని రమణయ్య, జనసేన జిల్లా అధ్యక్షుడు మనుక్రాంత్‌రెడ్డి, సీపిఐ నాయకులు దామా అంకయ్య, మాలకొండయ్య, సిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

## నిరాశ్రయుల వసతికి..

# మరో రెండు కేంద్రాలు

### కార్పొరేషన్ కమిషనర్ వికాస్ మర్మత్ ఆదేశాలు

నెల్లూరు నగరంలో నిరాశ్రయుల కోసం ప్రస్తుతం పాత మునిసిపల్ కార్యాలయంలో ఉన్న కేంద్రంతో పాటు, మరో రెండు కేంద్రాలను కూడా ఏర్పాటు చేయాలని నగర కార్పొరేషన్ కమిషనర్ వికాస్ మర్మత్ సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈనెల 4న ఆయన నగరంలోని కొండాయపాళెం వద్ద ఉన్న బీసీ వసతిగృహ ప్రాంగణాన్ని, ఏబీఎం కాంపౌండ్ పరిసర ప్రాంతాలను పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ, రోజు రోజుకు నిరాశ్రయుల సంఖ్య పెరుగుతోందని, అందుకు ప్రస్తుతం ఉన్న భవనం చాలదని, అదనంగా మరో రెండు భవనాలను వారికోసం సిద్ధం చేయాలని అధికారులకు చెప్పారు.

# రాష్ట్రస్థాయి క్రీడలకు.. వాణిశ్రీ స్కూల్ విద్యార్థులు



రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ పోటీలకు నెల్లూరు రూరల్ మండలంలోని సౌత్‌మోపూరు గ్రామంలో ప్రముఖ సినీనటి, కళాభినేత్రి వాణిశ్రీ పేరుతో ఉన్న 'వాణిశ్రీ జడ్పీ హైస్కూల్'కు చెందిన పలువురు విద్యార్థులు ఎంపిక కావడం విశేషం. వివిధ విభాగాల్లో క్రీడలకు తమ స్కూల్‌కు చెందిన విద్యార్థులు 19 మంది ఎంపికయ్యారని, అండర్ 14-17 విభాగాల్లో హాకీ, క్యారమ్స్, ఫుట్‌బాల్ పోటీల్లో తమ పాఠశాల విద్యార్థులు సత్తా చాటుతూ రాష్ట్రస్థాయి క్రీడలకు సమాయత్తమవుతున్నారని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎం.అన్వర్ హుస్సేన్ చెప్పారు. ఈ సందర్భంగా ఆ విద్యార్థులందరినీ ఈనెల 4న పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో హెడ్మాస్టర్‌తో పాటు, ఫిజికల్ డైరెక్టర్ నాగేంద్ర, ఉపాధ్యాయులు, విద్యార్థులు అభినందించారు.

## జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించాలంటూ..

# 'సేవ్ జర్నలిజం డే'




నెల్లూరులోని ఏపీయూడబ్ల్యూజే (ఆంధ్రప్రదేశ్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్) ఆధ్వర్యంలో అక్టోబరు 2న 'సేవ్ జర్నలిజం డే'ని నిర్వహించారు. ఐజేయు (ఇండియన్ జర్నలిస్ట్స్ యూనియన్) ఆదేశాల మేరకు ఈ కార్యక్రమం జరిగింది. జర్నలిస్టు నాయకులు మాట్లాడుతూ, దేశవ్యాప్తంగా పాత్రికేయుల సమస్యల పరిష్కారం కోసం ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. సోషల్ మీడియా విస్తరణతో పాత్రికేయరంగానికి కొత్త సవాళ్ల ఎదురవుతున్నాయన్నారు. జర్నలిస్టుల సంఖ్య పెరిగిన మన రాష్ట్రంలో అర్హులైన జర్నలిస్టులకు కూడా అక్రిడిటేషన్లు నిరాకరించడం బాధాకరమన్నారు. కరోనాతో మృతి చెందిన జర్నలిస్టులకు 5 లక్షల రూపాయలను ఎక్స్‌గ్రేషియాగా మంజూరు చేస్తామని జీవో ఇచ్చారని, కానీ ఆ నిధులు ఇంకా విడుదల చేయకపోవడం బాధాకరమన్నారు. తక్షణమే ఆ నిధులు మంజూరుచేయాలని వారు డిమాండ్ చేశారు. జర్నలిస్టుల రక్షణకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక చట్టం తేవాలన్నారు. రైల్వేలో నిలిపివేసిన జర్నలిస్ట్ పాసులను పునరుద్ధరించాలని, పాత్రికేయులందరికీ ఇళ్ల స్థలాలు మంజూరుచేయాలని డిమాండ్ చేశారు. అనంతరం, పాత్రికేయుల సమస్యలు పరిష్కరించాలంటూ నగరంలోని మహాత్మా గాంధీ విగ్రహం వద్ద ఆందోళన చేసి, గాంధీవిగ్రహానికి విజ్ఞాపనపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఏపీయుడబ్ల్యుజె రాష్ట్ర కార్యదర్శి అనుమల జయప్రకాష్. జిల్లా అధ్యక్షులు వల్లూరు వెంకటేశ్వర్లు. ఎలక్ట్రానిక్ మీడియా జిల్లా అధ్యక్షులు రమేష్. 'సామ్నా' జిల్లా అధ్యక్షులు సర్వేపల్లి రామమూర్తి, సహాయ కార్యదర్శి నరేంద్ర, కోశాధికారి హనోక్. సభ్యులు ప్రతాప్, నర్సింహులు, రాష్ట్రకార్యవర్గ సభ్యులు గోపీనాధ్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజలను మోసగించడంలో
# చంద్రబాబు సిద్ధహస్తుడు

### కోవూరు ఎమ్మెల్యే ప్రసన్న విమర్శ



ప్రజలను మోసగించడంలో చంద్రబాబు సిద్ధహస్తుడని కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి విమర్శించారు. స్కిల్‌స్కామ్‌లో అరెస్టయిన చంద్రబాబు జైల్లో ఉన్న నేపథ్యంలో, టీడీపీ నాయకులు చేపట్టిన మోతమోగిద్దాం కార్యక్రమం ద్వారా చంద్రబాబు అవినీతి మోతమోగిందని దుయ్యబట్టారు. మండల కేంద్రమైన బుచ్చిరెడ్డిపాళెంలో ఈనెల 1న ఆయన వైకాపా కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. చంద్రబాబు చేసిన అవినీతి అక్రమాలకు, ఆయన మామ ఎన్టీఆర్‌కు ఆయన చేసిన నమ్మకద్రోహానికి ఎలాంటి శిక్ష పడినా తప్పులేదన్నారు. చంద్రబాబు సీఎంగా ఉన్నప్పుడు స్కిల్ స్కామ్‌లో 241కోట్ల రూపాయలు దోచుకున్నారని, సీఐడి అధికారులు అన్ని కోణాల్లో విచారించి, అందులో చంద్రబాబు హస్తం ఉందని తేలడంతో అరెస్ట్ చేశారని చెప్పారు. చంద్రబాబు అవినీతి అక్రమాలకు పాల్పడకపోతే రెండు ఎకరాల స్థాయి నుంచి నాలుగు లక్షల కోట్లకు ఎలా అధిపతి అయ్యారో చెప్పాలన్నారు. 14 ఏళ్ళు సీఎంగా పాలించిన చంద్రబాబు జీవితమంతా కుట్రలు కుతంత్రాలతోనే సాగిందని ఆయన విమర్శించారు. చంద్రబాబుపై జనసేన పవన్‌కల్యాణ్ ప్రేమ ఒలకబోయడం విచిత్రంగా ఉందన్నారు. ఈ సమావేశంలో పలువురు వైకాపా నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# రానున్న ఎన్నికల్లోనూ... వైకాపాకు విజయం చేకూర్చండి

### - ప్రజలకు పిలుపునిచ్చిన రాజ్యసభ సభ్యుడు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి

రానున్న ఎన్నికల్లో కూడా ప్రజలు వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీకి అఖండ విజయం చేకూర్చాలని కోరుతూ రాజ్యసభ సభ్యుడు, వైకాపా జిల్లా అధ్యక్షుడు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ప్రజలకు పిలుపునిచ్చారు. ఈనెల 1న నెల్లూరు రూరల్ నియోజకవర్గంలోని దొంతాలి గ్రామంలో 4.5 కోట్ల రూపాయలతో రోడ్ల నిర్మాణానికి ఆయన నెల్లూరు ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డితో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వేమిరెడ్డి మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో తాను నెల్లూరు ఎంపీ స్థానానికి, ఆదాల ప్రభాకర్‌రెడ్డి నెల్లూరు రూరల్ నియోజకవర్గ ఎమ్మెల్యే స్థానానికి పోటీ చేస్తున్నామని, ప్రజలు తమను ఆదరించి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఆదాల ప్రభాకర్‌రెడ్డి కేవలం 7 నెలల్లోనే రూరల్ నియోజకవర్గానికి దాదాపు వందకోట్ల రూపాయలకు పైగానే నిధులు కేటాయించి నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తున్నారని ఆయన చెప్పారు. ప్రజల సమస్యల పరిష్కారానికి తాను తనవంతు కృషిచేస్తానని ఆయన



హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా పలువురు రైతులకు మంజూరైన పట్టాదారు పాసు పుస్తకాలను ఆదాలతో కలిసి రైతులకు అందజేశారు. నగర మేయర్ స్రవంతి, విజయ డెయిరీ ఛైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డి, డెప్యూటీ మేయర్ రూప్‌కుమార్‌యాదవ్, వైకాపా నాయకుడు హరిబాబుయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# వైభవంగా చండీ హోమం

నెల్లూరు మూలాపేటలోని శంకరమఠంలో ఇటీవల వైభవంగా చండీహోమం జరిగింది. భాద్రపద పౌర్ణమిని పురస్కరించుకుని కంచి పీఠం వేదపండితుడు సోమేశ్వరశర్మ ఆధ్వర్యంలో ఈ హోమం నిర్వహించారు. సర్వరాజు శ్యామ్‌సుందర్ దంపతులు ఉభయకర్తలుగా వ్యవహరించగా, మఠం నిర్వాహకులు కొర్రపాటి నంద కిషోర్, ఉషాకుమారి పర్యవేక్షించారు.

# రాహుల్ చేతిలో 'కుల గణన అస్త్రం'!?



భారతదేశ సామాజిక నడక ఓ మలుపు తిరగబోతోంది. ఓ పెద్ద కుదుపుకు లోను కాబోతోంది. ఈ "తుట్టె"ను బీహార్ ముఖ్యమంత్రి నితీష్‌కుమార్ బలంగా కదిలించారు. దీని ప్రభావం దేశవ్యాప్తంగా ప్రకంపనలు సృష్టించడం ఖాయం అంటున్నారు సామాజిక నిపుణులు.

దేశంలో బీసీలు, ఓబీసీల జనాభాకు తగిన నిష్పత్తిలో వారికి రాజకీయాధికారం అందడం లేదని, వారితో పోల్చుకుంటే... తక్కువ జనాభా కలిగిన అగ్రవర్ణాల వారే రాజ్యాధికారాన్ని ఎగరేసుకు పోతున్నారనే విమర్శలు దేశ వ్యాప్తంగా ఉన్నాయి. అగ్రవర్ణాల వారి సామాజిక ఆధిపత్యం, ఆర్థిక వనరులు మొదలైనవి బీసీలు, ఓబీసీలకు లేకపోవడం ఈ పరిస్థితికి ప్రధాన కారణం.

దేశంలో బీజేపీ ఆధిపత్య రాజకీయాల నేపథ్యంలో బీసీలు, ఓబీసీల జనాభా ఎంత ఉందో తేల్చాలని బీహార్ ముఖ్యమంత్రి నితీష్‌కుమార్ సంకల్పించారు.

ఆయన ఓబీసీ కులానికి చెందినవారు కావడం మాత్రమేగాక బీహార్‌లో యాదవ ప్రభువులైన లాలూ ప్రసాద్‌యాదవ్, ఆయన కుటుంబం సహాయంతో ప్రభుత్వాన్ని నడుపుతున్నారు.

దీంతో, దేశంలో బీసీ, ఓబీసీ జనాభా ఎంతో దేశానికి తేటతెల్లం చేయాలని వారు నిర్ణయించారు.

అగ్రవర్ణ అధిపత్యానికి అడ్డుకట్ట వేయడం వారి అసలు ఉద్దేశం.

దాంతో, ఈ 'కుల గణన' ఆలోచనను, ప్రయత్నాన్ని బీజేపీ తీవ్రంగా వ్యతిరేకించింది. ప్రధాని మోడీ స్వయంగా ఓబీసీ వర్గానికి చెందిన వ్యక్తి అయినప్పటికీ, ఈ ఆలోచనను తీవ్రంగా వ్యతిరేకించారు.

బీహార్ ముఖ్యమంత్రి బీజేపీతో కలిసి ఉన్నప్పటికీ ఆయన డిమాండ్‌ను మోడీ తిరస్కరించారు.

బీజేపీ నుంచి విడిపోయి, లాలూ ప్రసాద్‌యాదవ్ పార్టీతో జత కట్టి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిన తరువాత, కుల గణనను కనీసం బీహార్‌లో జరపాలని ఆయన డిసైడ్ అయిపోయారు.

ఈ ప్రయత్నాన్ని బీజేపీ న్యాయస్థానాలలో సవాలు చేసింది.


పట్నా హైకోర్టు ఈ పిటిషన్‌లను కొట్టేసింది. ఫిర్యాదీదారులు సుప్రీం కోర్టుకు పరిగెత్తారు. ఈలోగా, కుల గణన జరిగిపోయింది. వివరాలు... గాంధీ జయంతి నాడు అక్టోబర్ 2న ప్రకటించేశారు. భారత జనాభాకు సంబంధించి... కొత్త చరిత్ర ఆవిష్కృతం అయింది.

సుప్రీం కోర్టులో ఈ అంశం ఈనెల 6న విచారణకు రావచ్చు. కుల గణన జరిగిపోయి, వివరాలను బీహార్ ప్రభుత్వమే అధికారికంగా ప్రకటించిన తరువాత... కుల గణనకు వ్యతిరేకంగా దాఖలైన పిటిషన్లను సుప్రీం కోర్టు విచారిస్తుంది(ట).

సరే, ఆ విషయం పక్కన పెడితే... ఈ దేశంలో బీసీ, ఓబీసీలు కలిస్తే దాదాపు 60శాతానికి పైబడి ఉన్నారు అనేది బీహార్ కులగణన సారాంశం. అంటే, జనాభాలో మూడింట రెండు వంతులు అన్నమాట.

ఈ 'అధికారిక' కుల గణన వివరాలు... 2024 ఎన్నికలను గణనీయంగా ప్రభావితం చేయబోతున్నాయి. ఈ ఏడాది చివర్లో జరగవలసి ఉన్న తెలంగాణ, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌ఘడ్, రాజస్థాన్ వంటి రాష్ట్రాల ఎన్నికలలో పార్టీల 'మైండ్ సెట్' పై కూడా ఈ సర్వే ప్రభావం గట్టిగా ఉంటుంది.

మన దేశంలో ఏ పార్టీ పైకి నీతులు వల్లిస్తున్నప్పటికీ, ఎన్నికలు వచ్చేసరికి... కులాల వారీగానే అభ్యర్థులను ప్రకటించడం ఒక ఆనవాయితీగా వస్తోంది. అందువల్ల తమకు లోక్‌సభ, శాసనసభల్లో ఎస్సీలు, ఎస్టీలకు వలే 66శాతం సీట్లు రిజర్వు చేయాలనే 'డిమాండ్' ప్రారంభం కావచ్చు. రాజకీయ పార్టీలు కూడా మానసిక ఒత్తిడికి లోను కావడం సహజం. ఈ 'కుల స్పృహ' పట్టణాలు, నగరాల్లో పెద్దగా కనిపించక పోవచ్చునేమో గానీ, సెమీ-




అర్బన్, గ్రామీణ ప్రాంతాలలో రోజువారీ వ్యవహార లావాదేవీలు కుల ప్రాతిపదికగానే జరుగుతూ ఉంటాయి. టికెట్ల కేటాయింపులో... అధికార పంపిణీలో తమకు అధికార పార్టీ న్యాయం చేయడం లేదనే భావన బీసీల్లో కలిగితే రాజకీయ పార్టీలకు ఇబ్బందే.

బీహార్‌లో బీసీ, ఓబీసీ కలిపి 63శాతం మంది జనాభా ఉన్నారు.

షెడ్యూల్ కులాలవారు దాదాపు 20శాతం ఉంటే, షెడ్యూల్ ట్రైబ్స్ దాదాపు ఒకటిన్నర శాతం పైబడి మాత్రమే ఉన్నారు.

ఆ తాయిలాలు, ఈ తాయిలాలు చేతుల్లో పెట్టి రాజకీయాలను శాసిస్తున్న అగ్రకులాల వారు బీహార్‌లో కేవలం 15.5 శాతమే. అంటే మన రాష్ట్రంలో కమ్మ, కాపు, రెడ్డి, బ్రాహ్మణ, వైశ్య, క్షత్రియ లాగా అన్న మాట.

ఈ దేశంలో కుల గణన అనేది మొదటిసారిగా 1931లో జరిగింది. అంటే వంద సంవత్సరాల క్రితం. పాకిస్తాన్, బాంగ్లాదేశ్ కూడా అప్పుడు భారత్‌లో అంతర్భాగమే.

బీహార్‌లో జరిగిన కుల గణన భేరీ... దేశవ్యాప్తంగా రీ-సౌండ్ ఇవ్వడం ఖాయమే.

ప్రతిపక్ష 'ఇం.డి.యా.' కూటమి అధికారంలోకి రాగానే, మొత్తం దేశ వ్యాప్తంగా కుల గణన జరిపిస్తామని లాలూ ప్రసాద్‌యాదవ్ ప్రకటించారు.

కాంగ్రెస్ యువ నాయకుడు రాహుల్‌గాంధీ ఈ బీహార్ సర్వేను గట్టిగా స్వాగతించారు. బీసీలు, ఓబీసీల జనాభాకు తగిన రాజ్యాధికారం వారికి దక్కాల్సిందేనని ఆయన తెగేసి చెప్పారు.

'హిందీ హార్ట్‌ల్యాండ్'గా గణుతికెక్కిన ఉత్తరాది హిందీ రాష్ట్రాలలో... బీహార్ కుల గణన ప్రభావం గానీ, రాహుల్‌గాంధీ ప్రకటన ప్రభావం గానీ చాలా గట్టిగా ఉండే అవకాశం ఉంది. ఫలితంగా బీజేపీ ఇరుకున పడే అవకాశాలు ఉన్నాయి.

అటు అగ్రవర్ణాలతో పాటు, ఇటు బీసీ... ఓబీసీలను కూడా మచ్చిక చేసుకోవడం వల్లనే 2019లో కేంద్రంలో అధికారంలోకి రావడంతో పాటు ఉత్తరప్రదేశ్‌లో బీజేపీ విజయం సాధించిందని ప్రతిపక్షాలు లేటుగా గ్రహించాయి. ఇప్పుడు బీజేపీ నుంచి బీసీ, ఓబీసీ ఓటు బ్యాంకును హైజాక్ చేసేందుకు రాహుల్‌గాంధీ నడుం బిగించారు.

'మాకు ఉన్న నలుగురు ముఖ్యమంత్రుల్లో ముగ్గురు ఓబీసీ వర్గాలకు చెందిన వారే' అని రాహుల్‌గాంధీ ప్రకటించారు. వచ్చే ఎన్నికల్లో 50శాతానికి పైబడి బీసీ, ఓబీసీ వర్గాలకే కాంగ్రెస్‌పార్టీ టికెట్స్ ఇస్తామనే హింట్ కూడా ఇచ్చారు. దీంతో, కాంగ్రెస్ రాజకీయ ముఖచిత్రంలో గణనీయమైన మార్పులు చోటు చేసుకోబోతున్నాయి.

ఈ బీహార్ కుల గణన ప్రభావం తెలుగు రాష్ట్రాల రాజకీయాలపై సైతం గట్టిగా పడుతుందనడంలో సందేహం లేదు. బీసీలకు పెద్దఎత్తున టికెట్స్ కేటాయించని పార్టీ... ఎన్నికల్లో నష్టపోయే అవకాశము ఉంది.

ప్రస్తుతం వెలమ, రెడ్డి వంటి అగ్రవర్ణాల వారు తెలంగాణలో రాజకీయ, సామాజిక, ఆర్థిక, సాంస్కృతిక అధికారం చెలాయిస్తుంటే... ఆంధ్రలో రెడ్డి, కమ్మ వర్గాల వారు ఈ రంగాలకు నాయకత్వం వహిస్తున్నారు. రానున్న ఎన్నికల్లోనూ ఈ 'సుప్రిమసీ'ని ఇదే స్థాయిలో వైసీపీ, టీడీపీ ప్రదర్శించగలుగుతాయేమోననేది పరిశీలించవలసిన అంశం అంటున్నారు పరిశీలకులు.


- భోగాది వేంకట రాయుడు
శాన్ఫ్రాన్సిస్కో నుండి...
medhomadhanam@gmail.com



# విద్యాదాత... నేదురుమల్లి పద్మనాభరెడ్డి కన్నుమూత!

**ప్రముఖ విద్యాదాత, గాంధేయవాది, మాజీ ముఖ్యమంత్రి నేదురుమల్లి జనార్దన్‌రెడ్డికి స్వయానా సోదరుడు.. నేదురుమల్లి పద్మనాభరెడ్డి తన 91వ ఏట ఈనెల 4వ తేదీ బుధవారం నాడు వయోభారంతో వాకాడులోని తన నివాసంలో కన్నుమూశారు. తమ పెదనాన్న మరణించారనే సమాచారం తెలియడంతోనే వెంకటగిరిలో ఉన్న నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి హుటాహుటిన తన కుటుంబసభ్యులతో కలసి వాకాడుకు వెళ్ళి ఆయన పార్థివదేహాన్ని సందర్శించి కన్నీటి నివాళులర్పించారు.**





దివంగత నేదురుమల్లి బాలకృష్ణారెడ్డి హారిజన ఉద్ధారక సంఘం పెట్టి వేలాది మంది విద్యార్థులకు విద్యనందించేందుకు వాకాడులో విద్యాసంస్థలను స్థాపించగా, వాటి స్థాపన విషయంలోనూ అటు తర్వాత వాటి నిర్వహణలోనూ పద్మనాభ రెడ్డిదే కీలకపాత్ర. అటు నేదురుమల్లి బాలకృష్ణారెడ్డికి, ఇటు జనార్ధన్‌రెడ్డికి కూడా పద్మనాభరెడ్డి ఎంతో అండగా ఉండేవారు. విద్యతోనే దేశానికి ప్రగతి సాధ్యమవుతుందని గట్టిగా విశ్వసించిన వ్యక్తి ఆయన. కాంగ్రెస్‌లోనూ ఆయనకెంతో గౌరవం ఉండేది. సీనియర్ నేతగా ఏఐసిసి సభ్యునిగా రెండుసార్లు పార్టీకి సేవలందించారు. తిరుపతిలో ఏఐసిసి ప్లీనరీ జరిగినప్పుడు ప్లీనరీ నిర్వహణలోనూ పద్మనాభరెడ్డిదే ప్రధానపాత్ర.

నేదురుమల్లి పద్మనాభరెడ్డికి దివంగత మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డితో మంచి అనుబంధం ఉండేది. వైఎస్సార్ పాదయాత్ర చేస్తున్న రోజుల్లో ఆయనకు పద్మనాభరెడ్డి అండగా నిలిచారు. ఆ సమయంలో వైఎస్సార్‌ను పద్మనాభరెడ్డి వాకాడులోని తమ నివాసానికి ఆహ్వానించి ఆతిథ్యమిచ్చారు. వైఎస్ మరణానంతరం కూడా అదే ఆత్మీయతతో ఆయన తనయుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని అభిమానిస్తూ ఓదార్పు యాత్రలో పాల్గొన్నారు. వైఎస్ జగన్ రెండుసార్లు పద్మనాభరెడ్డి నివాసంలో బస చేశారు. ఈ నేపథ్యంలో పద్మనాభరెడ్డి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరడం, పార్టీలో చేరినప్పటినుంచి పార్టీకి తనవంతు సేవలందిస్తుండడం అందరికీ తెలిసిందే. ఆయన నిబద్ధతను గౌరవిస్తూ వైకాపా ఆయనకు సీజీసీ సభ్యునిగా సముచితమైన స్థానం కల్పించింది కూడా.

## ప్రముఖుల సంతాపం :


నేదురుమల్లి పద్మనాభరెడ్డి భౌతికకాయాన్ని జిల్లాలోని అనేకమంది ప్రముఖ నాయకులు, పెద్దసంఖ్యలో ప్రజలు, నేదురుమల్లి అభిమానులు సందర్శించి నివాళులర్పించారు. నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి తన కుటుంబసభ్యులతో కలసి వాకాడుకు వచ్చి ఆయన భౌతికదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. నెల్లూరు జిల్లా కాంగ్రెస్ నేత చేవూరు దేవకుమార్‌రెడ్డి ఆయన భౌతిక కాయాన్ని దర్శించి, ఆయన లేని లోటు ఏనాటికీ తీరనిదంటూ ఆవేదన వ్యక్తం చేశారు. గూడూరు ఎమ్మెల్యే వరప్రసాద్‌రావు, ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్, నాయకులు ఎల్లసిరి గోపాల్‌రెడ్డి, జడ్పీటీస సభ్యులు రౌతు రామకృష్ణ, కొడవలూరు దామోదర్‌రెడ్డి తదితరులంతా వచ్చి నివాళులర్పించారు. వారి కుటుంబసభ్యులకు తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

# కాలుష్య రహిత పద్ధతులపై.. శ్రీసిటీలో సదస్సు



ది ఇండియన్ గ్రీన్ బిల్డింగ్ కౌన్సిల్(ఐజీబీసి), కాన్ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీ (సిఐఐ), శ్రీసిటీ సంయుక్త ఆధ్వర్యంలో 'కాలుష్య రహిత స్థిరమైన హరితహిత పద్ధతులు' అనే అంశంపై ఈనెల 4న శ్రీసిటీలో పెద్దఎత్తున సదస్సు జరిగింది. స్థిరత్వ విధానాలు, జీరో పొల్యూషన్ సాధన రోడ్‌మ్యాప్, గ్రీన్ బిల్డింగ్ కాంగ్రెస్–2023 తదితర అంశాలపై సదస్సులో చర్చలు జరిగాయి. ఐజీబీసీ చెన్నై చాప్టర్ ఛైర్మన్, ఒలింపియా గ్రూప్ ఇండియా మేనేజింగ్ డైరెక్టర్ అజిత్ చోర్డియా మాట్లాడుతూ, శ్రీసిటీ మరియు వివిధ పరిశ్రమలు అమలుచేస్తున్న సుస్థిరత కార్యక్రమాలు సంతృప్తికరంగా ఉన్నాయంటూ ప్రశంసించారు. కర్బన ఉద్గారాలను పెంచకుండా, పర్యావరణ అనుకూల వ్యూహాలతో ముందుకు సాగే కంపెనీలు, సంస్థలను నెట్–జీరో (పూర్తి కాలుష్య రహితం) కంపెనీలుగా గుర్తించడం జరుగుతుందని, ప్రతి సంస్థ కూడా 'నెట్ జీరో' కంపెనీగా నిలవాలని ఆయన ఈ సందర్భంగా కోరారు. పచ్చదనం, స్థిరత్వ విధానాలు, నెట్–జీరోకు మార్గదర్శకాలపై సిఐఐ–ఐజీబీసి డెప్యూటీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎం.ఆనంద్ వర్చువల్‌గా తన సందేశమిస్తూ నెట్–జీరో ఆలోచన స్వీకరణను వేగవంతం చేయడానికి, నెట్–జీరోలో భాగంగా విద్యుత్‌శక్తి, నీరు, వ్యర్థాల నిర్వహణకు సంబంధించి ఐజీబీసి గ్రేడింగ్ విధానాలను వివరించారు. పునరుత్పాదక ఇంధన విస్తరణను వేగవంతం చేయడం, ఇంధన సామర్థ్యాన్ని మెరుగుపరచడం, కార్బన్ క్యాప్చర్ టెక్నాలజీలను అభివృద్ధి చేయడం, పారిశ్రామిక ప్రక్రియలను మార్చడం తదితర అంశాలు నెట్–జీరో సాధనలో కీలకాంశాలని ఆయన చెప్పారు. ఐజీబీసీ వరల్డ్ గ్రీన్ బిల్డింగ్ కౌన్సిల్, జీ20, బీ20, సిఐఐ సంయుక్తంగా నవంబర్ 23–25తేదీల్లో చెన్నైలో నిర్వహించనున్న గ్రీన్ బిల్డింగ్ కాంగ్రెస్ ఎక్స్‌పో ఈవెంట్‌కు అందరూ హాజరుకావాలని ఆయన శ్రీసిటీ పరిశ్రమల ప్రతినిధులను ఆహ్వానించారు. శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి తన సందేశంలో ఈ సదస్సు నిర్వహణపట్ల సంతోషం వ్యక్తంచేస్తూ, శ్రీసిటీ పర్యావరణ అనుకూల విధానాలను వివరించారు. శ్రీసిటీ ప్రెసిడెంట్ సతీష్ కామత్, జనరల్ మేనేజర్ డాక్టర్ వెంకటేశ్వరన్‌తో పాటు సుమారు 60 మంది కంపెనీ ఎగ్జిక్యూటివ్‌లు ఈ సదస్సులో పాల్గొన్నారు.

# జిల్లా ఎక్సైజ్ అధికారిగా.. నాగమల్లేశ్వరరెడ్డి



జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఇన్‌చార్జి అధికారిగా కె.నాగమల్లేశ్వరరెడ్డి ఈనెల 4న నెల్లూరులో బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న కె.వెంకటరామిరెడ్డి గుంటూరుజిల్లాకు బదిలీ అయ్యారు. కొత్తగా బాధ్యతలు చేపట్టిన నాగమల్లేశ్వరరెడ్డి రాజ్యసభ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిని, నెల్లూరు ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డిని మర్యాద పూర్వకంగా కలుసుకున్నారు.






Edited, Published, Printed & Owned by **THUNGA SIVAPRABHATH REDDY**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at **Roopa Graphics**, Magunta Layout, NELLORE-3.
Cell: 9866314741. Editor-**THUNGA SIVAPRABHATH REDDY,** Managing Editor : **T.BHARATHI REDDY,** Sub-Editor : **MADDURU SRINIVASULU.** e-mail: lawyerpatrika@gmail.com